


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు

సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర

# రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAMUDHRA | RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | సోమవారం | 04.05.2026 | సంపుటి: 3 | సంచిక: 92 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | MONDAY | 04.05.2026 | V0LUME : 3 | ISSUE : 92 | PAGES: 8 | COST: 2/- |



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575


## ఫీజు రీయింబర్స్ మెంట్ ఎత్తివేతకు కాంగ్రెస్ కుట్ర

- జీవో 7తో విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకం
- ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని బలహీనపరిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు
- రూ.10 వేల కోట్ల బకాయిలు చెల్లించకుండా కొత్త విధానాలతో మభ్యపెడుతున్న కాంగ్రెస్ సర్కారు : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

3






# బీజేపీని ఇరికిద్దాం...

## సీఎం రేవంత్ రెడ్డి టార్గెట్ ఫిక్స్

కమలం పార్టీని కార్నర్ చేసే దిశగా వ్యూహాలు

కాషాయ దళానికి రివర్స్ ట్రీట్‌మెంట్ ఇచ్చే ప్లాన్‌లో రేవంత్

కాళేశ్వరం ప్రాజెక్ట్ కేంద్రంగా ఇరుకున పెట్టేందుకు స్కెచ్

కేసు సీబీఐకి ఇస్తే 24 గంటల్లో జైల్లో పెడతామని గతంలో కిషన్ రెడ్డి స్టేట్‌మెంట్

ఇన్నాళ్ళయినా ఏం చేశారంటూ ఇక చర్చకు పెట్టే ప్లాన్

రాజముద్ర న్యూస్, హైదరాబాద్ :

తెలంగాణ సీఎం సరికొత్త టార్గెట్ ఫిక్స్ చేసుకున్నారా? ఇప్పటి దాకా ఎవరూ ఊహించని నిర్ణయం తీసుకున్నారా? కేంద్ర మంత్రి భుజాన తుపాకీ పెట్టి రాష్ట్రంలో కాషాయ దళాన్ని లక్ష్యంగా చేసుకున్నారా? బీజేపీ కూడా ఏం మాట్లాడలేని పరిస్థితి కల్పించాలనుకుంటున్నారా? రేవంత్‌రెడ్డి కొత్త టార్గెట్ ఏంటి? అజెండా ఎలా ఫిక్స్ చేశారు? తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సరికొత్త వ్యూహాలకు పదును పెడుతున్నారట. ఆ దిశగా ఆల్రెడీ ఆయన టార్గెట్ ఫిక్స్

మిగతా 2వ పేజీలో..

## సింగరేణి చరిత్రలో మైలురాయి..

### రామగుండం కోల్ మైన్ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్..!

- ₹2,194 కోట్ల మెగా ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ శాఖ ప్రాథమిక అనుమతులు
- ఏడాదికి 210 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తితో సింగరేణిలోనే అతిపెద్ద లక్ష్యం
- 5,500 మందికి ఉపాధి భరోసా.. రామగుండం రీజియన్‌కు మరో 25 ఏళ్ల జీవం
- రెండు ఓపెన్‌కాస్ట్, మూడు భూగర్భ గనులతో విప్లవాత్మక ప్రణాళిక
- పర్యావరణహిత సాంకేతికతతో తవ్వకాలు.. ఎన్టీపీసీకి ఇంధన సరఫరా మరింత బలోపేతం

రాజముద్ర న్యూస్, హైదరాబాద్ :

సింగరేణి కాలరీస్ సంస్థ అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందించిన రామగుండం (ఆర్‌జీ) కోల్ మైన్ ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ శాఖ నుంచి ప్రాథమిక అనుమతులు లభించడంతో సంస్థ చరిత్రలో కీలక మలుపు తిరిగింది. సుమారు ₹2,194.05 కోట్ల భారీ వ్యయంతో చేపట్టనున్న ఈ మెగా ప్రాజెక్టు,

మిగతా 2వ పేజీలో..




## రైతన్న గుండెల్లో మంటలు..



2

## తెలుగు రాష్ట్రాల్లో భిన్నవాతావరణం

### పగలు సెగలు.. సాయంత్రం జల్లులు

పగలు భానుడి భగభగలు.. సాయంత్రం అకాల వర్షాలు తిరుపతి, సిద్దిపేట, కాకినాడలో భిన్న వాతావరణ దృశ్యాలు గాలివానలతో పంటలపై పడుతున్న కోలుకోలేని దెబ్బ

2



- రాజముద్ర న్యూస్, హైదరాబాద్



3

## మీర్‌పేట్‌లో ఓ కారు బీభత్సం

- బానెట్‌పై వ్యక్తి వేలాడుతూ 2 కి.మీ ఈడ్చుకెళ్లిన డ్రైవర్
- మందమల్లమ్మ జంక్షన్ వద్ద స్థానికులు అడ్డగింత

## కరీంనగర్‌లో పట్టపగలు తుపాకుల మోత..

- జ్యువెలరీ షాపులో సినీ ఫక్కీ దోపిడీ
- పీఎంజే జ్యువెలరీలోకి చొరబడి సిబ్బందిపై కాల్పులు జరిపిన దుండగులు
- ఒక ఉద్యోగి మృతి.. ముగ్గురికి తీవ్ర గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం
- బంగారం, వజ్రాభరణాలు దోచుకుని బైకులపై పరారైన ఐదుగురు ముఠా
- సీసీటీవీలో రికార్డైన నిందితుల కదలికలు.. సరిహద్దుల్లో పోలీసుల హైఅలర్ట్
- వ్యాపార వర్గాల్లో భయం.. భద్రతపై తీవ్ర ఆందోళన




కరీంనగర్ నగరం ఆదివారం పట్టపగలు తుపాకుల మోతతో ఒక్కసారిగా ఉలిక్కిపడింది. అత్యంత రద్దీగా ఉండే ప్రాంతంలోని పీఎంజే జ్యువెలరీ షాపులో ఐదుగురు

మిగతా 2వ పేజీలో..



## అవినీతి, కుటుంబ, కుల రాజకీయాలను ప్రజలు నమ్మొద్దు

- తెలంగాణ రాజకీయాలపై అమెరికా నుంచి కేఏ పాల్ సంచలన వ్యాఖ్యలు
- కొత్త పార్టీల వెనుక వ్యక్తిగత, కుటుంబ ప్రయోజనాలే ప్రధానమని ఆరోపణ
- ప్రజాసేవ పేరుతో స్వార్థ రాజకీయాలు చేస్తే ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్న సూచన
- కుటుంబ ఆధారిత రాజకీయాలకు తెలంగాణలో భవిష్యత్ లేదని స్పష్టం
- ప్రజలు నిజాయితీ రాజకీయాలను ఆదరించాలని ప్రజాశాంతి పార్టీ అధినేత పిలుపు

2

- రాజముద్ర న్యూస్, నేషనల్ బ్యూరో

## ఎన్నికల ఫలితాలపై దేశమంతా

# సర్వత్రా ఉత్కంఠ

- నేడే ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు..
- ఫలితాల కంటే ముందు నుంచే పందాల జోరు పెరిగింది
- ముఖ్యంగా పశ్చిమ బెంగాల్, తమిళనాడు ఫలితాలపై భారీగా బెట్టింగ్‌లు
- పోలీసుల నిఘా పెరగడంతో బెట్టింగ్ రాయుళ్లు కొత్త మార్గాలు ఎంచుకుని, ప్రత్యేక యాప్‌ల ద్వారా పందాలు నిర్వహిస్తున్నారనే ప్రచారం

రాజముద్ర న్యూస్, నేషనల్ బ్యూరో :

ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలపై దేశవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే సర్వే సంస్థలు ఫలితాలు వెల్లడించాయి. ఈ క్రమంలో గెలిచే పార్టీలు.. వాటి సీట్ల సంఖ్యపై పందాలు జోరందుకున్నాయి. అందరి చూపు పశ్చిమబెంగాల్,

మిగతా 2వ పేజీలో..





## నన్ను డీజీపీగా చూడాలన్న కోరికే అమ్మను బతికించింది

- తల్లిని కలిసి ఆశీస్సులు తీసుకున్న తెలంగాణ నూతన డీజీపీ
- తీవ్ర అనారోగ్యాన్ని జయించడానికి తల్లి మనోబలమే కారణమన్న సీవీ ఆనంద్
- కొడుకు డీజీపీ కావాలన్న ఆశయమే ఆమెకు జీవం పోసిందని వెల్లడి
- అమ్మ ఆనందం చూసి తానూ ఉప్పొంగిపోయానన్న పోలీస్ బాస్
- బాధ్యతలు చేపట్టిన వెంటనే కుటుంబ బంధంపై హృదయాన్ని హత్తుకున్న వ్యాఖ్యలు

రాజముద్ర న్యూస్, హైదరాబాద్ :

తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన సీవీ ఆనంద్ తన తల్లిపై చేసిన భావోద్వేగ వ్యాఖ్యలు హృదయాలను కదిలించాయి. ఇటీవల తన తల్లిని కలిసి ఆశీస్సులు తీసుకున్న ఆయన, తన జీవితంలో ఈ పదవి ఎంత ముఖ్యమో, తల్లికి అది

మిగతా 3వ పేజీలో..



## మీర్‌పేట్‌లో విషాదం..

డీజిల్ పోసుకుని బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

ఇంట్లో ఎవరూ లేని సమయంలో దారుణ నిర్ణయం తీసుకున్న యువతి

గండిపేట ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న కీర్తి

కుటుంబ సభ్యులు బయటకు వెళ్లిన వేళ ఘటన.. మంటల్లో కాలిపోయి మృతి

రాజముద్ర న్యూస్, హైదరాబాద్ :

హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో బీటెక్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. బడంగ్‌పేట మారుతీనగర్‌లో నివాసం ఉంటున్న కీర్తి (21) అనే యువతి ఇంట్లో ఎవరూ లేని సమయంలో డీజిల్ పోసుకుని నిప్పంటించుకోవడంతో అగ్నికి ఆహుతైంది. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. మహబూబ్‌నగర్‌కు చెందిన కుటుంబం బడంగ్‌పేటలో నివసిస్తుండగా, కీర్తి గండిపేటలోని

మిగతా 3వ పేజీలో..



# సింగరేణి చరిత్రలో మైలురాయి.. రామగుండం కోల్ మైన్ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్..!

**మొదటిపేజీ తరువాయి**

సింగరేణి భవిష్యత్తును మరింత బలోపేతం చేయనున్నదిగా భావిస్తున్నారు. 4326 హెక్టార్ల విస్తీర్ణంలో విస్తరించిన ఈ ప్రాజెక్టు ద్వారా 314.98 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలను వెలికి తీయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.
సింగరేణి చరిత్రలోనే అత్యధికంగా ఏడాదికి 210 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంతో ఈ ప్రాజెక్టును రూపుదిద్దారు. రెండు ఓపెన్‌కాస్ట్ గనులు, మూడు భూగర్భ గనులను సమన్వయం చేస్తూ రూపొందించిన ఈ విశిష్ట ప్రాజెక్టులో ఓపెన్‌కాస్ట్ ద్వారా 182.28 మిలియన్ టన్నులు, భూగర్భ గనుల ద్వారా 132.70 మిలియన్ టన్నుల బొగ్గు వెలికితీయనున్నారు. గతంలో మూతపడిన జీడీకే10, వకీల్‌పల్లి గనులను తిరిగి వినియోగంలోకి తెచ్చి పాత గనులకు కొత్త ఊపిరి పోయనున్నారు.
ఈ ప్రాజెక్టు అమలుతో రామగుండం రీజియన్‌కు మరో 25 ఏళ్లపాటు సుస్థిర భవిష్యత్తు లభించనుంది. ప్రస్తుతం పాత గనులు మూతపడుతున్న నేపథ్యంలో సుమారు 5,500 మంది ఉద్యోగులు, కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. దీని ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊతం లభించడంతో పాటు కార్మిక కుటుంబాలకు భరోసా ఏర్పడనుంది. తక్కువ పెట్టుబడులతో గరిష్ట ఉత్పత్తి సాధించే దిశగా సింగరేణి యాజమాన్యం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది.
పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ అత్యాధునిక సాంకేతికతను ఈ ప్రాజెక్టులో వినియోగించనున్నారు. తవ్వకాలలో వెలువడే ఓవర్‌బర్డెన్‌ను బయట పడేయకుండా ఖాళీ క్వారీల్లోనే తిరిగి నింపే బ్యాక్‌ఫిల్లింగ్ విధానాన్ని అమలు చేయనున్నారు. షావెల్‌డంపర్, లాంగ్‌వాల్, కంటిన్యూయస్ మైనర్ వంటి ఆధునిక టెక్నాలజీలతో పర్యావరణహిత మైనింగ్ చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా లభించే బొగ్గు ఎన్టీపీసీ రామగుండం సహా పలు విద్యుత్ కేంద్రాలకు కీలక ఇంధన వనరుగా మారనుంది.
రామగుండం కోల్ మైన్ ప్రాజెక్టు సింగరేణి సంస్థకు మాత్రమే కాకుండా తెలంగాణ పారిశ్రామిక, ఉపాధి, ఇంధన రంగాలకు కూడా గేమ్‌చేంజర్‌గా నిలవనుంది. కేంద్ర అనుమతులతో ఈ మెగా ప్రాజెక్టు కార్యరూపం దాల్చడం సింగరేణి భవిష్యత్తుకు కొత్త దిశగా భావిస్తున్నారు. కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ యాజమాన్యం, కేంద్ర పర్యావరణ శాఖ అధికారులు, రామగుండం రీజియన్ ప్రతినిధులు, కార్మిక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# రైతన్న గుండెల్లో మంటలు..

- **100 ఎకరాల్లో కాలి బూడిదైన పంట..**



ఆదిలాబాద్ జిల్లాలో ఘోర అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ మంటల వల్ల సుమారు 100 ఎకరాల్లో చేతికొచ్చిన మొక్కజొన్న, జొన్న పంటలు అగ్నికి ఆహుతయ్యాయి. చేతికొచ్చిన పంట కళ్ల ముందే కాలి బూడిదవ్వడం చూసిన అన్నదాతలు కన్నీరుమున్నీరు అవుతున్నారు. కన్నబిడ్డల్లా సాక్కున్న పంట అగ్గి పాలైందని విలపిస్తున్నారు. ఈ సంఘటన బోథ్ మండలం కన్గుట్ట గ్రామంలో ఆదివారం నాడు చోటు చేసుకుంది. మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా చెలరేగిన మంటలకు చేతికొచ్చిన మొక్కజొన్న పంటా కాలి బూడిదైపోయింది.
ముందు ఒక చేనులో మొదలైన మంటలు చూస్తుండగానే క్షణాల వ్యవధిలోనే పక్కనే ఉన్న ఇతర పొలాలకు శరవేగంగా వ్యాపించాయి. ఏం జరిగిందో తేరుకునేలోపే.. కాపుకొచ్చిన పంట కళ్ల ముందే కాలి బూడిదయ్యింది. ఈ ఘోర అగ్నిప్రమాదం వల్ల సుమారు వంద ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంట కాలి బూడిదైంది. మంటల ధాటికి ఆ ప్రాంతమంతా దట్టమైన పొగతో నిండిపోయింది.
ప్రమాదం జరిగి గంటలు గడుస్తున్నా మంటలు ఇంకా అదుపులోకి రాలేదు. కన్గుట్ట గ్రామంలో ప్రారంభమైన మంటలు పొరుగునే ఉన్న బోథ్, సాకెరా గ్రామ శివార్లకు వేగంగా వ్యాపిస్తున్నాయి. వేసవి కాలం, పైగా వడగాలుల తీవ్రత ఎక్కువగా ఉండటంతో మంటలను ఆర్పడం అగ్నిమాపక సిబ్బందికి, స్థానికులకు కష్టతరంగా మారింది. వేల రూపాయల పెట్టుబడి పెట్టి, రాత్రింబవళ్లు కష్టపడి పండించిన పంట కళ్ల ముందే బుగ్గిపాలవుతుండటంతో అన్నదాతల బాధ వర్ణనాతీతంగా ఉంది. మంటలు మరింత విస్తరించకముందే అధికారులు స్పందించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# అవినీతి, కుటుంబ, కుల రాజకీయాలను ప్రజలు నమ్మొద్దు

**హైదరాబాద్, మే 3 :**



అవినీతి, కుటుంబ, కుల రాజకీయాలను ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ పిలుపునిచ్చారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన తెలంగాణ రాజకీయ పరిణామాలపై స్పందిస్తూ విడుదల చేసిన వీడియోలో, ప్రజల భావోద్వేగాలను ఉపయోగించుకుని స్వప్రయోజనాల కోసం కొత్త రాజకీయ వేదికలు సృష్టించే వారిపై తీవ్ర విమర్శలు చేశారు.
తెలంగాణలో ప్రజాసేవ కంటే వ్యక్తిగత, కుటుంబ, ఆస్తి పరిరక్షణ లక్ష్యాలతోనే కొందరు రాజకీయ పార్టీలు ఏర్పడుతున్నాయని కేఏ పాల్ ఆరోపించారు. ప్రజల సంక్షేమం పేరుతో కుటుంబ ఆధిపత్యం, కుల ప్రాతిపదిక, అవినీతి రాజకీయాలు కొనసాగితే రాష్ట్ర భవిష్యత్తు దెబ్బతింటుందని హెచ్చరించారు. ప్రజలు నాయకుల అసలు ఉద్దేశ్యాలను గుర్తించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు.
కుటుంబ విభేదాలు, వ్యక్తిగత ఆశయాలు, రాజకీయ లాభాల కోసం పార్టీలు స్థాపించడం ప్రజలకు ఉపయోగపడదని ఆయన పేర్కొన్నారు. నిజమైన నాయకత్వం ప్రజా సమస్యల పరిష్కారంలో కనిపించాలే గానీ, వ్యక్తిగత అధికార పోరాటాల్లో కాదన్నారు. తెలంగాణ ప్రజలు ఇకపై మోసపూరిత రాజకీయాలకు లొంగకుండా, నిబద్ధత కలిగిన నాయకత్వాన్ని మాత్రమే ఆదరించాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం తాను అమెరికాలో బిజీగా ఉన్నప్పటికీ తెలంగాణ రాజకీయ పరిణామాలను గమనిస్తున్నానని, రాష్ట్ర ప్రజలు అవగాహనతో ముందుకు సాగాలని కేఏ పాల్ అన్నారు. దేశ, రాష్ట్ర రాజకీయాల్లో మార్పు రావాలంటే ప్రజలే చైతన్యవంతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే తుది నిర్ణేతలని, అవినీతి, కుటుంబ, కుల రాజకీయాలను తిరస్కరించడం ద్వారానే సమాజానికి మెరుగైన భవిష్యత్తు సాధ్యమవుతుందని కేఏ పాల్ పేర్కొన్నారు.

# ఎన్నికల ఫలితాలపై దేశమంతా సర్వత్రా ఉత్కంఠ

**మొదటిపేజీ తరువాయి**

తమిళనాడు ఫలితాలపైనే. దీంతో ఆ రెండు రాష్ట్రాల్లో రిజల్ట్సపై బెట్టింగ్ జోరుగా సాగుతోంది. పందాలపై పోలీసుల నిఘా పెరగడంతో బెట్టింగ్ రాయుళ్లు రూట్ మార్చారు. ఐపీఎల్ తరహాలో ప్రత్యేక యాప్‌లో బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది. ఫోన్ కాల్ అవసరం లేకుండా ఆర్థిక లావాదేవీల వివరాలన్నీ యాప్ ద్వారానే జరిగేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారనే టాక్ వినిపిస్తోంది. పోటీ ఏదైనా.. ఎక్కడైనా.. బెట్టింగ్ ఖాయం అన్నట్టుగా మారిపోయింది పరిస్థితి. ఫలానా రాష్ట్రంలో.. ఫలానా పార్టీ అధికారంలోకి రాబోతుందని.. సదరు నియోజకవర్గంలో పలానా అభ్యర్థి గెలవబోతున్నారంటూ భారీగా పందాలు కాస్తున్నారు. వందకు వెయ్యి.. వెయ్యికి లక్ష అంటూ బెట్టింగ్ బంగార్రాజులు పందాలు కాస్తున్నారు. పెద్ద లీడర్లు తలపడుతున్న నియోజకవర్గాల్లో ఎవరికి ఎంత మెజార్టీ వస్తుందన్న దానిపై పందాలు కాస్తున్నారు. ఎక్కడ ఎవరు గెలవబోతున్నారు.. అధికారంలోకి ఎవరు రాబోతున్నారు.. ప్రతీ గల్లీలో ఏ నలుగురు కలిసినా ఇదే చర్చ నడుస్తోంది.
అస్సాం, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరి రాష్ట్రాల 2026 శాసనసభ ఎన్నికల ఫలితాలను ఎన్నికల సంఘం మే 4న ప్రకటించనుంది. మొదట పోస్టల్ బ్యాలెట్లను, ఆ తర్వాత ఈవీఎంలలో నమోదైన ఓట్లను లెక్కించే ప్రామాణిక ప్రక్రియను అనుసరించి, సోమవారం సాయంత్రానికల్లా ఫలితం వెలువడే అవకాశం ఉంది.
ఫలితాల తేదీ, సమయం:
తేదీ: మే 4, సోమవారం
లెక్కింపు: ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుంది.
తొలి ట్రెండ్స్: తొలి రెండు, వ•డు గంటల్లోనే ట్రెండ్స్పై ఓ క్లారిటీ వస్తుంది
తుది ఫలితాలు: లెక్కింపు రౌండ్ల వేగాన్ని బట్టి, బహుశా మధ్యాహ్నం లేదా సాయంత్రానికి వెలువడే అవకాశం ఉంది.
ఓట్లను ఎలా లెక్కిస్తారు?
భారత ఎన్నికలలో ఓట్ల లెక్కింపు, ఎన్నికల సంఘం పర్యవేక్షణలో ఒక క్రమబద్ధమైన, దశలవారీ పక్రియను అనుసరిస్తుంది. ఇది ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్లతో ప్రారంభమవుతుంది. ఈ బ్యాలెట్లను సర్వీస్ ఓటర్లు, ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది, దివ్యాంగులు వంటి నిర్దిష్ట వర్గాల వారు వేస్తారు. చట్టపరమైన నిబంధనల ప్రకారం ఈ బ్యాలెట్లను మొదట లెక్కిస్తారు, ఆ తర్వాత ముందుకు వెళ్లే ముందు వాటి మొత్తం ఓట్లను నమోదు చేస్తారు. దీని తర్వాత, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్‌లలో నమోదైన ఓట్లను లెక్కిస్తారు, ఈ పక్రియ సాధారణంగా సుమారు 30 నిమిషాల తర్వాత ప్రారంభమవుతుంది. కాగితపు బ్యాలెట్‌ల వలె కాకుండా, అధికారులు, పార్టీ ప్రతినిధుల సమక్షంలో ఫలితాల బటన్‌ను నొక్కినప్పుడు, ఈ•వీలు ప్రతి అభ్యర్థికి నమోదైన మొత్తం ఓట్లను ప్రదర్శిస్తాయి. పోస్టల్ బ్యాలెట్లు, ఈవీఎం లెక్కింపులతో సహా అన్ని దశలు పూర్తయి, ధ•వీకరించబడిన తర్వాత ఫలితాలు ప్రకటిస్తారు.
ఎలక్షన్ టాప్ నైన్ న్యూస్ దిగువన చూద్దాం..
1) ఓట్ల లెక్కింపులో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులను సూపర్‌వైజర్లుగా నియమించడాన్ని సవాల్ చేస్తూ త•ణవ•ల్ కాంగ్రెస్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఆదేశాలు జారీ చేసేందుకు సుప్రీంకోర్టు తిరస్కరించింది. కౌంటింగ్ సిబ్బందిని ఎంచుకునే స్వేచ్ఛ ఎన్నికల సంఘానికి ఉందని స్పష్టం చేసింది. శనివారం సెలవు అయినప్పటికీ ఈ పిటిషన్ విచారించేందుకు సుప్రీంకోర్టు ప్రత్యేకంగా సమావేశమైంది.
2) స్ట్రాంగ్ రూములల్లో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపణలు వస్తుండటంతో కౌంటింగ్ సందర్భంగా ఎన్నికల సంఘం మరిన్ని కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. బెంగాల్‌లో లెక్కింపు సందర్భంగా 165 మంది అదనపు కౌంటింగ్ పరిశీలలకులు, 77 మంది పోలీసు పరిశీలకులను నియమించింది.
3) గడిచిన రెండు నెలలుగా జరిగిన నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంత అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం ఉదయం ఓట్ల లెక్కింపు జరగనుంది.
4) రెండొందలకు పైగా సీట్లలో విజయం సాధించబోతున్నామని •వీ• అధ్యక్షురాలు, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ పార్టీ శ్రేణులకు తెలిపారు. కౌంటింగ్ ఏజెంట్లతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఎగ్జిట్ పోల్స్ అనేవి స్టాక్‌మార్కెట్‌ను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని మమత తెలిపారు. 2021, 2024లోనూ ఇలాగే చేశారని మమత వివరించారు.
5) బెంగాల్‌లోని డైమండ్ హార్బార్, మగ్రాహాత్ అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 15 పోలింగ్ స్టేషన్లలో రీపోలింగ్ నిర్వహించారు. మండుతున్న ఎండలను లెక్కచేయకుండా ఓటర్లు ఓటు వేశారు. మొత్తం 15 పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్‌ను ఎన్నికల అధికారులు వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలించారు.
6) బెంగాల్‌లో రీపోలింగ్ సందర్భంగా స్థానికులు భారీ ఆందోళన చేపట్టారు. •వీ• నేతలు బెదిరిస్తున్నారని స్థానికుల నిరసనకు దిగారు. ఇళ్లకు వచ్చి వాళ్లు తమను బెదిరిస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీకి ఓటెయ్యలేదన్న కోపంతో తమను బెదిరిస్తున్నారని తెలిపారు. రీపోలింగ్‌లో తమను ఓటెయ్యకుండా టీఎంసీ నేతలు అడ్డుకున్నారని ఆరోపించారు
7) పని ద్వారా బీజేపీ మళ్లీ గెలవలేదు కాబట్టే చోరీ ద్వారా తనను కాపాడుకుంటోందని అస్సాం పీసీసీ అధ్యక్షుడు గౌరవ్ గొగయ్ ఆరోపించారు. స్ట్రాంగ్ రూమ్స్ నిర్వహణలో అనేక అవకతవకలు జరుగుతున్నాయని తెలిపారు. ఎన్నికల సంఘం ఏం చేస్తోందని ప్రశ్నించారు. స్ట్రాంగ్ రూమ్స్ లోపల బీజేపీ కార్యకర్తలు ఉంటున్నారని గొగయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.
8) తమ ఎమ్మెల్యేలను కాపాడుకునేందుకు తాను గౌహతి వచ్చానని కర్నాటక డిప్యూటీ సీఎం ఙఖ శివకుమార్ తెలిపారు. అస్సాంలో కాంగ్రెస్ తరపున పోటీ చేసిన అభ్యర్థులతో ఆయన భేటీ అయ్యారు. ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేష్ బఘేల్ కూడా గౌహతి వచ్చారు. ఎగ్జిట్ పోల్స్ను తాను నమ్మనని శివకుమార్ అన్నారు.
9) తమిళనాడులో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్లలో భద్రతను బలోపేతం చేయాలని ••ఖ పార్టీ డిమాండ్ చేసింది. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి అధవ అర్జున, చెన్నైలోని తమిళనాడు ఎన్నికల ప్రధానాధికారి అర్చనా పట్నాయక్‌ను కలిశారు. శ్రీరంగంలోని తమ పార్టీ కార్యాలయంపై దాడికి సంబంధించి కూడా ••ఖ ఫిర్యాదు చేసింది.

# బీజేపీని ఇరికిద్దాం...

**మొదటిపేజీ తరువాయి**

అయిపోయినట్టు తెలుస్తోంది. పొలిటికల్ స్టేట్మెంట్స్‌తో తనను ఇరుకున పెట్టాలని చూస్తున్న బీజేపీ నేతలకు రివర్స్ ట్రీట్‌మెంట్ ఇవ్వాలని ముఖ్యమంత్రి భావిస్తున్నట్టు తెలుస్తోంది. అందులో భాగంగానే...... కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి భుజం మీద తుపాకీ పెట్టాలని డిసైడైనట్టు చెప్పుకుంటున్నారు. రెండు అంశాల ఆధారంగా ఆయన మీద వత్తిడి పెంచాలని భావిస్తున్నారట ముఖ్యమంత్రి. ఆ మేటర్‌లో వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నట్టు తెలుస్తోంది.
కాళేశ్వరం ప్రాజెక్టు సెంట్రిక్‌గానే ప్రత్యర్థులను ఇరుకున పెట్టే స్కెచ్ రెడీ అయిందని అంటున్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో అవకతవకలు జరిగాయంటూ... రాష్ట్రంలో రాజకీయ దుమారం రేగుతున్న సంగతి తెలిసిందే. దీనికి సంబంధించే... గతంలో భారీ స్టేట్‌మెంట్ ఇచ్చారు కిషన్‌రెడ్డి. కాళేశ్వరం దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తూ.... రాష్ట్ర ప్రభుత్వం తరపున తీర్మానం చేసి పంపండి....24 గంటల్లో నిందితుల్ని జైల్లో పెడతామంటూ గతంలో ప్రకటించారు కేంద్ర మంత్రి. అదే సమయంలో కారణం ఏదైనాగానీ... సీబీఐ దర్యాప్తు కోసం రాష్ట్రం నుంచి ప్రతిపాదన వెళ్లింది. కానీ... ఇంతవరకు కేంద్ర దర్యాప్తు సంస్థ దాన్ని టేకప్ చేయలేదు.
సరిగ్గా... ఈ పాయింట్ మీదే రాజకీయ ప్రత్యర్థుల్ని ఇరుకున పెట్టాలనుకుంటున్నారట సీఎం. సీబీఐ ఇంత వరకు ఈ కేసును తీసుకోకపోవడాన్ని ఇక సీరియస్‌గా పరిగణించాలని సీఎం డిసైడైనట్టు తెలిసింది. దానికి సంబంధించి గతంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా ఒత్తిడి పెంచడంతో పాటు.....రాష్ట్రంలో బీజేపీని ఇరకాటంలోకి నెట్టాలనుకుంటున్నారట. దీని గురించే ప్రజల్లో చర్చ పెట్టి బీజేపీ వ్యవహారాన్ని బయటపెట్టాలనుకుంటున్నట్టు తెలుస్తోంది. తాజాగా.. తుమ్మిడి హెట్టి ప్రాజెక్టుకు సంబంధించిన ఇష్యూలోకి కూడా బీజేపీని లాగే ప్రయత్నం చేస్తున్నారు రేవంత్. తుమ్మిడి హెట్టి ప్రాజెక్ట్ కట్టాలంటే.... మహారాష్ట్రలో కూడా ముంపు ప్రాంతం ఉంటుంది. దానికి కూడా పరిహారం ఇవ్వడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు సీఎం.


అదే సమయంలో బీజేపీకి ఓ మెలిక కూడా పెట్టేశారు. మహారాష్ట్రలో ఆ పార్టీ ప్రభుత్వం ఉంది కాబట్టి... భూ సేకరణకు అక్కడి ప్రభుత్వాన్ని ఒప్పించే పనిని కిషన్ రెడ్డికి అప్పగించాలని డిసైడ్ అయ్యారట. దానికి సంబంధించిన వ్యవహారాలను చూసే బాధ్యత తను ఇరిగేషన్ మంత్రిగా ఉత్తమ్ కుమార్ రెడ్డికి అప్పగించారు. ముందు కిషన్ రెడ్డికి లేఖ రాయడం తో పాటు.. కలిసి మహారాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేలా చూడాలన్నది ఆ బాధ్యత. ఆ విధంగా సీఎం రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా కాళేశ్వరం, తుమ్మిడి హెట్టిలోకి కేంద్ర మంత్రిని ఇన్వాల్వ్ చేసి ఆయన భుజం మీద తుపాకీ పెట్టి బీజేపీని టార్గెట్ చేయాలనుకుంటున్నట్టు చెప్పుకుంటున్నాయి రాజకీయవర్గాలు. దీంతో.... కేంద్ర మంత్రి ఈ సిచ్యుయేషన్‌ని ఎలా ఎదుర్కొంటారన్నది ఆసక్తికరంగా మారింది.

# తెలుగు రాష్ట్రాల్లో భిన్నవాతావరణం...

- **పగలు సెగలు.. సాయంత్రం జల్లులు**

**హైదరాబాద్, మే3 :**

ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో అత్యంత వింతైన , విరుద్ధమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. పగటిపూట భానుడి ప్రతాపంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతుంటే, అనూహ్యంగా మధ్యాహ్నం తర్వాత కురుస్తున్న అకాల వర్షాలు వాతావరణాన్ని ఒక్కసారిగా మార్చేస్తున్నాయి. వేసవి తాపం, ఉక్కపోతతో అల్లాడిపోతున్న ప్రజలకు ఈ వర్షాలు కొంత ఉపశమనాన్ని ఇస్తున్నప్పటికీ, మరోవైపు అన్నదాతలకు మాత్రం తీరని ఆవేదనను మిగిలిస్తున్నాయి. ఎండలు, వర్షాలు ఒకేసారి పోటీ పడుతున్నట్లుగా సాగుతున్న ఈ పరిణామాలు జనజీవనాన్ని అస్తవ్యస్తం చేస్తున్నాయి.
రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు గరిష్ట స్థాయికి చేరుకున్న తరుణంలోనే ప్రకృతి తన ప్రతాపాన్ని చూపుతోంది. ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతిలో గరిష్ట ఉష్ణోగ్రత 41 డిగ్రీల వరకు నమోదవుతూ ఎండ తీవ్రత అధికంగా ఉంది. అయితే మధ్యాహ్నం సమయానికి ఒక్కసారిగా వాతావరణం మారిపోయి భారీ వర్షం కురుస్తోంది. అటు తెలంగాణలోని సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ప్రాంతంలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఉదయం ఎండ తీవ్రతతో ఇబ్బంది పడ్డ ప్రజలకు, మధ్యాహ్నం వీచిన ఈదురుగాలులు , ఓమోస్తరు వర్షం కొంత చల్లదనాన్ని పంచాయి. ఇక కాకినాడ జిల్లాలో నిన్నటి వరకు భరించలేనంతగా ఉన్న ఉక్కపోత నుంచి ఈరోజు ఉదయం కురిసిన భారీ వర్షం వల్ల ప్రజలకు విముక్తి లభించింది.



ఈ అకాల వర్షాలు సామాన్య ప్రజలకు కొంత మేలు చేసినప్పటికీ, వ్యవసాయ రంగంపై మాత్రం కోలుకోలేని దెబ్బ తీస్తున్నాయి. ముఖ్యంగా ఈదురుగాలులతో కూడిన వర్షం వల్ల పండ్ల తోటలు , ప్రధాన పంటలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. తిరుపతి జిల్లాలో వీస్తున్న బలమైన గాలుల కారణంగా చేతికి రావాల్సిన మామిడి కాయలు భారీగా నేలరాలిపోతుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. అటు కాకినాడ జిల్లాలో కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట ఈదురుగాలుల ధాటికి నేలకొరుగుతుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎంతో కష్టపడి పండించిన పంట కళ్లముందే నాశనమవుతుండటంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. మొత్తంగా చూస్తే, ఈ మండు వేసవిలో అకాల వర్షాలు తెలుగు రాష్ట్రాల్లో ఒక వింత , విషాదకరమైన పరిస్థితిని సృష్టించాయి.

# కరీంనగర్‌లో పట్టపగలు తుపాకుల మోత..

**మొదటిపేజీ తరువాయి**

దుండగులు సినీ ఫక్కీలో చొరబడి భారీ దోపిడీకి పాల్పడ్డారు. రెండు బైకులపై వచ్చిన నిందితులు తుపాకులతో సిబ్బందిని బెదిరించి, అడ్డుకునేందుకు ప్రయత్నించిన వారిపై కాల్పులు జరపడంతో ఒక ఉద్యోగి అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు.
పథకం ప్రకారం షోరూమ్‌లోకి ప్రవేశించిన దుండగులు కౌంటర్లలో ఉన్న బంగారు, వజ్రాభరణాలను బ్యాగుల్లో నింపుకుని పరారయ్యారు. గాయపడిన వారిని వెంటనే ఆస్పత్రికి తరలించగా, ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు. వందలాది మంది సంచరించే ప్రధాన రహదారిపై ఇలాంటి దారుణ ఘటన జరగడం స్థానికుల్లో తీవ్ర భయాందోళనలకు దారి తీసింది.
ఘటన సమాచారం అందుకున్న వెంటనే కరీంనగర్ పోలీస్ కమిషనర్ సహా ఉన్నతాధికారులు భారీ బలగాలతో ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. క్లూస్ టీమ్ సహాయంతో వేలిముద్రలు, ఇతర కీలక ఆధారాలను సేకరించారు. షోరూమ్‌లోని సీసీటీవీ ఫుటేజ్‌లో హెల్మెట్లు ధరించిన దుండగుల కదలికలు నమోదవడంతో, వారి భాష, వచ్చిన మార్గం, పరారైన దిశలపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.
దోచుకెళ్లిన బంగారం, వజ్రాభరణాల పరిమాణం కిలోలలో ఉండవచ్చని ప్రాథమిక అంచనా ఉన్నప్పటికీ, పూర్తి విలువను షోరూమ్ యాజమాన్యం నిర్ధారించాల్సి ఉంది. నిందితులు అంతర్రాష్ట్ర ముఠాకు చెందిన వారై ఉండొచ్చన్న అనుమానంతో అన్ని సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ ఘటనతో నగర వ్యాపార వర్గాల్లో భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.
కరీంనగర్‌లో జరిగిన ఈ దారుణ ఘటన పోలీసు భద్రతా వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. పట్టపగలు నగర హృదయంలోనే తుపాకులతో దోపిడీ జరగడం ప్రజలను కలవరపెడుతుండగా, నిందితులను త్వరగా అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు. కార్యక్రమంలో కరీంనగర్ పోలీస్ కమిషనర్, క్లూస్ టీమ్ అధికారులు, స్థానిక పోలీసులు, పీఎంజే జ్యువెలరీ సిబ్బంది, వ్యాపార వర్గాల ప్రతినిధులు పాల్గొన్నారు.



**దుండగులను పట్టించిన వారికి రూ.లక్ష బహుమానం**

కరీంనగర్, జ్యోతినగర్ లోని పీఎంజే జ్యూవెలరీ షాపులో కస్టమర్లలా వచ్చిన ఐదుగురు దుండగులు.. షాపులోని వారిని బెదిరించి.. వారిపై కాల్పులు జరిపి భారీ మొత్తంలో బంగారు ఆభరణాలను దోచుకెళ్లిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో కరీంనగర్ లోని కమాండ్ కంట్రోల్ తో పట్టణంలోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. దీంతో పాటు కరీంనగర్ పోలీసులు మరో ముఖ్యమైన ప్రకటన చేశారు. దొంగలను పట్టుకునేందుకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు. ఈక్రమంలో చోరీకి పాల్పడిన వారి ఫ్లెక్సీలు ప్రదర్శించడంతో పాటు.. దుండగుల ఫోటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఈ భారీ దోపిడీకి పాల్పడిన దొంగలను పట్టించిన వారికి రూ. లక్ష బహుమతి ఇస్తామని కరీంనగర్ పోలీసులు ప్రకటించారు.
ఈక్రమంలో చోరీకి పాల్పడిన నిందితుల ఫొటోలతో పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ ఫొటోలలో కనిపిస్తున్న వారు.. కరీంనగర్ లోని బంగారం షాపులో దొంగతనం చేశారు.. వీరి గురించి మీకు ఎలాంటి సమాచారం తెలిసినా సరే.. వెంటనే పోలీసులకు తెలియజేయండి. వీరి గురించి ఆచూకీ తెలిపిన వారికి లక్ష రూపాయలు బహుమతి ఇస్తామని కరీంనగర్ స్టేషన్ హౌజ్ ఆఫీసర్, ఏసీపీల పేరుతో పోస్టర్ రిలీజ్ చేశారు. ఆదివారం (మే 3) పట్టపగలు కరీంనగర్ లోని నడిబొడ్డున ఉన్న PMJ జ్యువెలరీ షాపులో భారీ దోపిడీ చేసిన విషయం తెలిసిందే. తుపాకులతో జ్యువెలరీలో చొరబడ్డ ఐదుగురు దోపిడి దొంగలు.. కస్టమర్లు, షాపు సిబ్బందిని బెదిరించి దాదాపు కిలో బంగారం దోచుకెళ్లారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. కేంద్రమంత్రి బండి సంజయ్ ఇంటికి కూతవేటు దూరంలో ఈ ఘటన జరిగింది. బండి సంజయ్ ఆ ప్రాంతంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అప్పటివరకు ఆ ప్రాంతంలో భారీ బందోబస్తు ఉంది.. ఎప్పుడూ రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో పట్టపగలు భారీ దోపిడీ జరగడం చర్చనీయాంశంగా మారింది.

# మీర్‌పేట్‌లో విషాదం..

**మొదటిపేజీ తరువాయి**

ఎంజీఐటీ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతోంది. శనివారం కళాశాలకు వెళ్లిన ఆమె మధ్యాహ్నం ఇంటికి చేరుకుంది. సాయంత్రం కుటుంబ సభ్యులు బంధువుల ఇంటికి వెళ్లిన సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న కీర్తి ఈ దారుణ నిర్ణయం తీసుకుంది.

డీజిల్ ఒంటిపై పోసుకుని నిప్పంటించుకోవడంతో ఇంట్లో మంటలు చెలరేగాయి. పొగ, కేకలు గమనించిన స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు హుటాహుటిన ఇంటికి చేరుకునే సరికి కీర్తి మంటల్లో కాలిపోయి మృతి చెందింది. సమాచారం అందుకున్న మీర్‌పేట్ పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కీర్తి సోదరుడు నాగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. యువతి ఈ తీవ్ర నిర్ణయం తీసుకోవడానికి గల కారణాలపై అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ శోభన్ తెలిపారు. కుటుంబ కలహాలా, వ్యక్తిగత సమస్యలా, లేక ఇతర కారణాలా అన్న దానిపై స్పష్టత కోసం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యువతలో మానసిక ధైర్యం, కుటుంబ మద్దతు, సమయానుకూల సలహా ఎంత ముఖ్యమో ఈ ఘటన మరోసారి గుర్తు చేస్తోంది. సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదని, క్షణికావేశ నిర్ణయాలు కుటుంబాలను శాశ్వత విషాదంలోకి నెడతాయని నిపుణులు చెబుతున్నారు.

# మీర్‌పేట్‌లో ఓ కారు బీభత్సం

**హైదరాబాద్, మే 3 :**

రంగారెడ్డి జిల్లా మీర్‌పేట్ పరిధిలో ఓ కారు బీభత్సం సృష్టించింది. మే1న రాత్రి ఈ ఘటన చోటు చేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కారు బానెట్‌పై వ్యక్తి వేలాడుతున్నా.. డ్రైవర్ కారు ఆపకుండా రెండు కిలో మీటర్లు లాక్కెళ్లాడు. అతను కేకేలు వేస్తూ ఆపమని వేడుకున్నా డ్రైవర్ కనికరం చూపలేదు. చివరికి స్థానికులు అడ్డగించడంతో కారు డ్రైవర్ కారును అక్కడే వదిలేసి పరారయ్యాడు. ఈ ఘటనలో వ్యక్తికి రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మే 1వ తేదీన రాత్రి గాయత్రి నగర్ నుంచి ఎల్బీనగర్ వైపు జిలానీ అతని కొడుకు ఫైసల్ ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. వెనుకనుంచి కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో బైక్ పై నుంచి ఇద్దరూ కిందపడ్డారు. ప్రమాదం అనంతరం కారు డ్రైవర్, జాలానీకి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో జిలానీపై కారు డ్రైవర్ దాడికి పాల్పడ్డాడు. ఆ తరువాత కారు డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించగా.. జిలానీ అడ్డుకున్నాడు. కారు బానెట్ పైకి ఎక్కి కారు పోకుండా అడ్డుకునే ప్రయత్నం చేశాడు. కానీ, డ్రైవర్ మాత్రం కారును ఆపకుండా ముందుకు పోనిచ్చాడు. కారు బానెట్‌పై ఉన్న జిలాని కారును ఆపాలంటూ పదేపదే డ్రైవర్ ను కోరాడు. గాయాలతో అరుస్తున్నా పట్టించుకోలేదు. కారును ఆపకుండా వేగంగా దూసుకెళ్లాడు. అలా రెండు కిలోమీటర్లు దూరం జిలానిని కారుతో ఈడ్చుకెట్టాడు. బాలాపూర్ క్రాస్ రోడ్స్ వరకు వేగంగా కారును పోనిచ్చాడు. మందమల్లమ్మ చౌరస్తా వద్ద ప్రయాణికులు అడ్డుకోవడంతో కారును వదిలేసి నిందితుడు పరారయ్యాడు. కారు ఢీకొట్టిన ప్రమాదంలో ఫైసల్ కు రెండు కాళ్లు విరిగినట్లు సమాచారం. ప్రస్తుతం ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నన్ను డీజీపీగా చూడాలన్న కోరికే అమ్మను బతికించింది : సీవీ ఆనంద్ భావోద్వేగం

**మొదటిపేజీ తరువాయి**

ఎంత పెద్ద కలగా మారిందో హృద్యంగా వివరించారు.

గత నవంబర్ నుంచి జనవరి వరకు తన తల్లి తీవ్ర అనారోగ్యంతో బాధపడ్డారని సీవీ ఆనంద్ గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో ఆమె ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా మారిందని, కుటుంబ సభ్యులంతా తీవ్ర ఆందోళనకు గురయ్యారని చెప్పారు. అయితే తన కొడుకును తెలంగాణ రాష్ట్ర డీజీపీగా చూడాలన్న ఆమె బలమైన కోరికే ఆ క్లిష్ట పరిస్థితి నుంచి బయటపడేసిందని తాను గట్టిగా నమ్ముతున్నానని భావోద్వేగంగా తెలిపారు.

ప్రస్తుతం తన తల్లి ఆరోగ్యం క్రమంగా మెరుగుపడిందని, ఇంకా మంచానికే పరిమితమైనప్పటికీ మానసికంగా ఎంతో సంతోషంగా ఉన్నారని చెప్పారు. డీజీపీగా తన నియామకం విషయం తెలిసిన క్షణంలో ఆమె ముఖంలో కనిపించిన ఆనందం తనకు జీవితాంతం మరిచిపోలేని అనుభూతిగా మిగిలిందన్నారు. తల్లి సంతోషమే తనకు అతిపెద్ద పురస్కారమని, ఆమె ఆశీస్సులతో ప్రజాసేవలో మరింత నిబద్ధతతో ముందుకు సాగుతానని స్పష్టం చేశారు.

సీనియర్ ఐపీఎస్ అధికారిగా ఎన్నో కీలక బాధ్యతలు నిర్వర్తించిన సీవీ ఆనంద్, తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ అత్యున్నత పదవిని చేపట్టిన తర్వాత చేసిన ఈ వ్యాఖ్యలు కుటుంబ విలువలు, తల్లిప్రేమ గొప్పతనాన్ని మరోసారి చాటాయి. ఆయన మాటలు పలువురిని భావోద్వేగానికి గురిచేశాయి.

# చిట్ ఫండ్ పేరుతో కుచ్చుటోపీ..

- **మీర్‌పేట్‌లో రూ.2 కోట్ల స్కాం బట్టబయలు**
- **'వెంకట సాయి చిట్ ఫండ్స్' పేరిట దశాబ్దకాలంగా డబ్బుల సేకరణ**
- **స్థానికులు, కాలనీవాసుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసి మోసం చేశారన్న ఆరోపణలు**
- **25 మందికి పైగా బాధితులు.. ఒక్కొక్కరి నుంచి రూ.2.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వసూళ్లు**
- **డబ్బులు అడిగితే చెక్కులు, ప్రామిసరీ నోట్లు.. చివరకు బెదిరింపులకే దిగారన్న బాధితులు**
- **మీర్‌పేట్ పోలీసులను ఆశ్రయించిన బాధితులు.. వెంటనే న్యాయం చేయాలని డిమాండ్**

**మీర్‌పేట్, మే 3 :**

చిట్ ఫండ్ పేరుతో భారీ ఆర్థిక మోసం మీర్‌పేట్‌లో వెలుగులోకి వచ్చింది. వైష్ణవి కాలనీ అధ్యక్షుడు సురేష్ కుమార్, అతని భార్యలు నిర్వహించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 'వెంకట సాయి చిట్ ఫండ్స్' పేరుతో గత పదేళ్లుగా ప్రజల నుంచి భారీ మొత్తాల్లో డబ్బులు సేకరించి మోసానికి పాల్పడ్డారన్న ఆరోపణలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం ఈ వ్యవహారంలో సుమారు రూ.2 కోట్ల వరకు స్కాం జరిగినట్లు బాధితులు చెబుతున్నారు.

వైష్ణవి కాలనీతో పాటు పరిసర ప్రాంతాల ప్రజల విశ్వాసాన్ని సంపాదించి చిట్టీల పేరుతో డబ్బులు సేకరించిన నిర్వాహకులు, ఒక్కొక్కరి నుంచి రూ.2.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెట్టుబడులు తీసుకున్నట్లు తెలుస్తోంది. 25 మందికి పైగా ఈ మోసానికి గురైనట్లు బాధితులు వెల్లడిస్తున్నారు. చిట్ గడువు ముగిసినా డబ్బులు తిరిగి ఇవ్వకుండా పదేపదే కాలయాపన చేస్తూ, బాధితులను మభ్యపెడుతున్నారని ఆరోపిస్తున్నారు.

డబ్బులు తిరిగి కోరినప్పుడు చెక్కులు, ప్రామిసరీ నోట్లు ఇచ్చి తప్పించుకోవడం, ఆ తర్వాత నిర్లక్ష్యంగా వ్యవహరించడం జరిగిందని బాధితులు వాపోతున్నారు. మరికొందరిని "ఏం చేసుకుంటారో చేసుకోండి" అంటూ బెదిరింపులకు కూడా పాల్పడుతున్నారని ఆరోపించారు. దీంతో మోసపోయిన బాధితులంతా ఒక్కటై మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఈ ఘటనతో వైష్ణవి కాలనీతో పాటు పరిసర ప్రాంతాల్లో ఆందోళన నెలకొంది. స్థానికుల విశ్వాసాన్ని ఆసరాగా చేసుకుని చిట్ ఫండ్ పేరుతో భారీగా డబ్బులు సేకరించి మోసం చేయడం పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సమాచారం. చిట్ ఫండ్ ముసుగులో ప్రజలను మోసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, తమ కష్టార్జిత డబ్బులు తిరిగి ఇప్పించాలని బాధితులు పోలీసులను వేడుకుంటున్నారు. ఈ ఘటన మరింత మంది మోసపోయిన అవకాశాలపై కూడా అనుమానాలు రేకెత్తిస్తోంది. కార్యక్రమంలో వైష్ణవి కాలనీ బాధితులు, మీర్‌పేట్ పోలీసులు, సురేష్ కుమార్ దంపతులు, స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్ మెంట్ ఎత్తివేతకు కాంగ్రెస్ కుట్ర

**హైదరాబాద్, మే 3 :**

తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంపై రాజకీయ వేడి రాజుకుంది. ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో 7ను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేదంటే విద్యార్థులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.

రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని కేటీఆర్ మండిపడ్డారు. జీవో 7 ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని పాతరేయడానికి తీసుకొచ్చిన కుటిల చర్య అని ఆయన విమర్శించారు. ఈ నిర్ణయం వల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన సుమారు 14 లక్షల మంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. పేద విద్యార్థుల ఆశయాలపై ఇది వెన్నుపోటు చర్యగా అభివర్ణిస్తూ, వెంటనే జీవోను వెనక్కి తీసుకుని విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ప్రారంభమైన ఈ పథకాన్ని కేసీఆర్ ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా కొనసాగించిందని కేటీఆర్ గుర్తుచేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫీజు బకాయిలు పేరుకుపోయాయని, గత రెండున్నరేళ్లుగా సుమారు రూ.10 వేల కోట్ల బకాయిలు చెల్లించలేదని ఆరోపించారు. ఫీజులు చెల్లించకుండా విద్యార్థుల ఖాతాల్లో నేరుగా నిధులు జమ చేస్తామంటూ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందన్నారు. బకాయిల కారణంగా వేలాది కళాశాలలు ఆర్థిక ఇబ్బందుల్లో



కూరుకుపోయాయని, నిధులు అడిగితే వన్‌టైమ్ సెటిల్మెంట్, టోకెన్ల పేరుతో మభ్యపెట్టారని విమర్శించారు. గురుకులాల్లో విద్యార్థుల మరణాలు, సరైన వసతుల లేమి కూడా ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని కేటీఆర్ అన్నారు. భారీ అప్పులు చేసిన ప్రభుత్వం విద్యార్థుల ఫీజుల విషయంలో మాత్రం నిర్లక్ష్యం ప్రదర్శించడం దుర్మార్గమని విమర్శించారు. రైతుబంధు సహా పలు హామీల్లో విఫలమైన ప్రభుత్వం ఇప్పుడు విద్యార్థుల భవిష్యత్తుతో కూడా ఆటలాడుతోందని మండిపడ్డారు. జీవో 7ను వెంటనే రద్దు చేయకపోతే విద్యార్థులతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వంపై సమరశంఖం పూరిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. ఇప్పటికే రైతుల ఆందోళనలతో రాష్ట్రం వేడెక్కుతోందని, దీనికి విద్యార్థి ఉద్యమం జతకలిస్తే ప్రభుత్వానికి తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం, ఫీజు రీయింబర్స్‌మెంట్ లబ్ధిదారులైన విద్యార్థులు, కళాశాల యాజమాన్యాలు పాల్గొన్నారు.



# ఈ బ్రాండ్లను ఇక ముట్టుకోలేరు..

- **మద్యం ప్రియులకు బిగ్ షాక్..**
- **కొన్ని బ్రాండ్ల ధరలు పెంపు**

**హైదరాబాద్, మే 3:**

మద్యం ప్రియులకు బిగ్ షాకిచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. మద్యం ధరలను భారీగా పెంచేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించినట్లు తెలుస్తోంది. దీంతో వచ్చే వారం రోజుల్లో పలు రకాల బ్రాండ్ల మద్యం ధరలు భారీగా పెరిగే అవకాశం ఉంది.

రాష్ట్రంలో ప్రతి రెండేళ్లకోసారి మద్యం ధరలు పెంచే ఆనవాయితీ ఉంది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో 2023 మే నెలలో మద్యం ధరలు పెరిగాయి. నిబంధనల ప్రకారం.. 2025 మే నెలలో మద్యం ధరలు పెరగాల్సి ఉంది. కానీ, వివిధ కారణాల వల్ల ప్రభుత్వం మద్యం ధరలను పెంచలేకపోయింది. మద్యం తయారీ కంపెనీలు ధరలను పెంచాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ఈ క్రమంలో మద్యం ధరలను పెంచేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్లు తెలుస్తోంది.

మద్యం ధరల సవరణ కోసం ప్రభుత్వం గతంలో ముగ్గురు సభ్యుల కమిటీని నియమించింది. ఈ కమిటీ వచ్చేవారం సమావేశం కానుంది. మద్యం కంపెనీల నుంచి వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. భారీగా ధరలు పెంచితే ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంది ప్రభుత్వం భావిస్తోంది. దీంతో సాధారణ బ్రాండ్స్‌కు చెందిన ఫుల్ బాటిపై రూ.60 వరకు, ప్రీమియం బ్రాండ్స్ ఫుల్ బాటిల్ పై రూ.100 వరకు పెంచాలని ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. ధరలు పెరిగితే ప్రతి నెలా రూ.250కోట్లు, ఏడాదికి సుమారు రూ.3వేల కోట్ల వరకు ప్రభుత్వానికి అదనపు ఆదాయం సమకూరే అవకాశాలు ఉన్నాయని సమాచారం. ప్రస్తుతం వేసవి కాలం.. మద్యం విక్రయాలు అధికంగా ఉంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో మద్యం ధరలు భారీగా పెంచితే సామాన్య, మధ్య తరగతి వర్గాల మద్యం ప్రియుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుందన్న భావనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలో ధరలు భారీగా పెంచకుండా నామమాత్రంగా పెంచాలని ఆలోచన చేస్తుందన్న వాదన కూడా ఉంది. ఏదిఏమైన మరో వారం పదిరోజుల్లో మద్యం ధరల పెంపుపై ప్రభుత్వం అధికారిక ప్రకటన జారీ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. అదే జరిగితే మద్యం ప్రియులకు బిగ్ షాకేనని చెప్పొచ్చు.

# బిర్యానీ ప్రియులకు బిగ్‌షాక్..!

- **హైదరాబాద్‌లో భారీగా పెరగబోతున్న ధరలు**

**హైదరాబాద్, మే3 :**



సండే వచ్చిందంటే చాలు.. ఎక్కువశాతం మంది నాన్‌వెజ్ ప్రియులు తమ స్నేహితులు లేదంటే కుటుంబ సభ్యులతో రెస్టారెంట్లు, హోటళ్లకు వెళ్తుంటారు. అక్కడ బిర్యానీ ఆర్డర్ చేసుకొని పుష్టిగా తేనేసి వస్తుంటారు. అయితే, బిర్యానీ ప్రియులకు షాకిచ్చేలా రెస్టారెట్లు, బిర్యానీ పాయింట్ల యాజమానులు కీలక నిర్ణయం తీసుకునేందుకు సిద్ధమయ్యాయి. కమర్షియల్ గ్యాస్ ధరను దాదాపు రూ.వెయ్యికి పెంచిన నేపథ్యంలో బిర్యానీ ధరలను భారీగా పెంచేందుకు అంటే సుమారు రూ.50వరకు పెంచేందుకు సిద్ధమవుతున్నారు. అదేజరిగితే బిర్యానీ ప్రియులకు షాకింగ్ న్యూస్ అవుతుందని చెప్పొచ్చు.

అమెరికా, ఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో గ్యాస్, చమురు సరఫరా నిలిచిపోయి ప్రపంచ దేశాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. భారత దేశంలోనూ చమురు, గ్యాస్ కొరత వేధిస్తోంది. ముఖ్యంగా గ్యాస్ కొరత రోజురోజుకు తీవ్రమవుతోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే గ్యాస్ ధరలను కేంద్ర ప్రభుత్వం పెంచేసింది. తాజాగా.. రెండు రోజుల క్రితం కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరను ఒకేసారి సుమారు రూ. వెయ్యి పెంచిన విషయం తెలిసిందే. దీంతో ఒకపక్క గ్యాస్ సిలిండర్ దొరకడం కష్టమవుతుండగా.. మరోవైపు ధరను భారీగా పెంచడంతో హైదరాబాద్ నగరంలోని రెస్టారెంట్లు, హోటళ్ల నిర్వాహకుల కష్టాలు ఎక్కువయ్యాయి.

మొన్నటి వరకు 19 కేజీల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ. 2,400 వరకు ఉండేది. కేంద్రం ఒక్కసారిగా కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరను రూ. వెయ్యి పెంచేసింది. దీంతో ప్రస్తుతం ఒక్కో కమర్షియల్ సిలిండర్ గ్యాస్ రేటు రూ.3400కు చేరింది. ప్రస్తుతం గ్యాస్ కొరత నేపథ్యంలో సిలిండర్లు ఆశించిన స్థాయిలో దొరికే పరిస్థితి లేదు. దీంతో చాలా మంది హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు అదనంగా మరో రూ.2వేలు చెల్లించి బ్లాక్‌లో కొనుగోలు చేస్తున్న పరిస్థితి. దీంతో ఆర్థిక భారం పెరుగుతోంది. ఈ క్రమంలో బిర్యానీ ధరలను పెంచేందుకు నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

ఒక్కో ప్లేట్ బిర్యానీపై ప్రస్తుతం ఉన్న ధరకంటే అదనంగా మరో రూ.50 పెంచేందుకు హోటళ్లు, రెస్టారెంట్ల యాజమాన్యాలు సిద్ధమయ్యారని సమాచారం. అదేజరిగితే నాన్ వెజ్ ప్రియులకు షాకింగ్ న్యూసే అవుతుంది. రెస్టారెంట్లు, హోటళ్లకు వెళ్లి బిర్యానీ తినేవారు ఇక నుంచి కాస్త ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు హైదరాబాద్ నగరంలో ఇరానీ ఛాయ్‌కు ఎంతో డిమాండ్ ఉంది. వీటి ధరలు కూడా పెంచేందుకు నిర్వాహకులు సిద్ధమవుతున్నారట. మొత్తానికి కమర్షియల్ సిలిండర్ గ్యాస్ ధర ఒక్కసారిగా దాదాపు రూ.వెయ్యి పెరగడంతో హోటళ్లు, రెస్టారెంట్లు, చాయ్ దుకాణాల నిర్వాహకులు ధరలను అమాంతం పెంచేందుకు సిద్ధమవుతున్నారు.

# న్యాయబద్ధమైన ప్రతి సమస్యను పరిష్కరిస్తాం:మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**ఖమ్మం, రాజముద్ర న్యూస్**







ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండానే ప్రజల వద్దకే అధికారులను పంపించి సమస్యలు పరిష్కరించే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ,సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.కూసుమంచి,తిరుమలాయపాలెం మండలంలోని బచ్చోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం వేరువేరుగా నిర్వహించిన ప్రజా దర్బార్‌లో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్,అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజలతో కలిసి ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సమస్యల పరిష్కారానికి ప్రజల వద్దకే ప్రత్యక్షంగా వచ్చి పార్టీలకతీతంగా ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి తక్షణమే పరిష్కరించేలా చర్యలు చేపట్టామని తెలిపారు. రెండున్నర ఏళ్లలో ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజలకు చేరువ చేయడానికి 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక చేపట్టామన్నారు.సాదా బైనామా,భూమి రికార్డు సమస్యలు, నిషేధిత జాబితా సమస్యలు వంటి వాటికి శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

**ఇందిరమ్మ ఇళ్లకు ఎక్కువ దరఖాస్తులు**

గత ప్రభుత్వం పేదలకు ఇళ్లు ఇవ్వకపోవడంతో ప్రజా దర్బార్ లో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎక్కువ దరఖాస్తులు వస్తున్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు.మే నెలాఖరులో రెండవ దశ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని,మూడు,నాలుగు దశల్లో కూడా ప్రతి అర్హుడికి ఇల్లు అందిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు.వరి,మొక్కజొన్న పంటలను మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నామని,సన్న వడ్లకి ఐదొందల రూపాయలను బోనస్ గా అందించి,కొనుగోలు చేసిన వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామని అన్నారు.2 లక్షల లోపు రుణమాఫీ చేశామని, రైతు భరోసా క్రింద ఎకరానికి సహాయాన్ని 10 వేల నుంచి 12 వేలకు పెంచామని తెలిపారు.రైతులకు సబ్సిడీ పై మే 5 నుంచి 7 వరకు వ్యవసాయ పనిముట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు.

**కదిలించిన మహిళ దీనగాథ**

కూసుమంచి మండలంలోని గట్టుసింగారం గ్రామానికి చెందిన షేక్ షకీనా అనే మహిళకు ఎడమ కాలు లేదు.

# సిటీలో డ్రంక్ అండ్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్

- **హైదరాబాద్, సైబరాబాద్‌లో మందుబాబులపై ఉక్కుపాదం**
- **వారాంతపు డ్రైవ్‌లో పట్టుబడిన 728 మంది మద్యంప్రియులు**
- **హైదరాబాద్‌లో 445, సైబరాబాద్‌లో 283 మందిపై కేసుల నమోదు**
- **ద్విచక్ర వాహనదారులే ఎక్కువగా పట్టుబడినట్లు వెల్లడి**
- **మద్యం మత్తులో ప్రమాదాలకు కారణమైతే 10 ఏళ్ల జైలు**

**హైదరాబాద్, మే3:**

హైదరాబాద్, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో వారాంతంలో నిర్వహించిన ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో భారీగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారు పట్టుబడ్డారు. రెండు కమిషనరేట్ల పరిధిలో కలిపి మొత్తం 728 మంది డ్రైవర్లపై కేసులు నమోదు చేసి, కఠిన చర్యలకు పోలీసులు సిద్ధమయ్యారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు మే 1, 2 తేదీల్లో చేపట్టిన తనిఖీల్లో 445 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో 371 మంది ద్విచక్ర వాహనదారులు, 26 మంది త్రీవీలర్ డ్రైవర్లు, 48 మంది కార్లు మరియు ఇతర వాహనాల డ్రైవర్లు ఉన్నారు. పట్టుబడిన వారి బ్లడ్ ఆల్కహాల్ కంటెంట్ (బీఏసీ) స్థాయిలను పరిశీలించి కేసులు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 283 మంది మందుబాబులు చిక్కారు. వీరిలో 227 మంది టూ వీలర్ డ్రైవర్లు, 39 మంది కార్ డ్రైవర్లు, 9 మంది త్రీ వీలర్ డ్రైవర్లు, 8 మంది భారీ వాహనాల డ్రైవర్లు ఉన్నారు. పట్టుబడిన వారందరినీ కోర్టులో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల ప్రాణాంతక ప్రమాదాలు జరిగితే భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) 2023 సెక్షన్ 105 కింద కేసులు నమోదు చేస్తామని సైబరాబాద్ పోలీసులు హెచ్చరించారు. ఈ నిబంధనల ప్రకారం గరిష్టంగా 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు జరిమానా కూడా విధించే అవకాశం ఉందని స్పష్టం చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై జీరో టాలరెన్స్ విధానంతో ప్రత్యేక డ్రైవ్‌లు నిరంతరం కొనసాగుతాయని అధికారులు పేర్కొన్నారు.

**బాధ్యతాయుతంగా వ్యవహరించాలి**

ప్రజల భద్రత కోసం మద్యం సేవించి వాహనాలు నడపకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, చట్టాల ఉల్లంఘనపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదని హెచ్చరించారు. కార్యక్రమంలో హైదరాబాద్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్), సైబరాబాద్ అడిషనల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జి. హనుమంతరావు ఉన్నారు.




## విమానం ఎమర్జెన్సీ డోర్ తెరిచి దూకేసిన ప్యాసింజర్

### చెన్నై ఎయిర్‌పోర్టులో ఘటన

**చెన్నై:** చెన్నై ఎయిర్‌పోర్టులో ఆదివారం షాకింగ్ ఘటన వెలుగు చూసింది. ఎయిర్ అరేబియా విమానంలోని ఓ ప్రయాణికుడు ఎమర్జెన్సీ తలుపు తెరిచి కిందకు దూకేశారు. షార్జా నుంచి వచ్చిన విమానంలో ఈ ఘటన జరిగింది. విమానం ల్యాండయ్యాక టాక్సీవే మీదుగా టెర్మినల్ వేపు వెళుతున్న తరుణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. జాతీయ మీడియా కథనాల ప్రకారం, విమానం మెల్లిగా కదులుతున్న సమయంలో ఈ ఘటన జరిగిందని ఎయిర్‌పోర్టు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఈ ఘటనలో ప్రయాణికులు, సిబ్బంది ఎవరికీ ఎలాంటి నష్టం జరగలేదని తెలిపారు. విమానం కూడా దెబ్బతినలేదని చెప్పారు. అప్పటికే ప్రయాణికుడు అనారోగ్యంతో ఉన్నట్టు కూడా వెలుగులోకి వచ్చింది. ప్రయాణ సమయంలోనే ఆయన వాంతులు చేసుకున్నట్టు కూడా తెలిసింది. ఇక విషయం తెలియగానే అప్రమత్తమైన సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ప్రయాణికుడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయనను పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన కారణంగా ఎయిర్‌పోర్టు కార్యకలాపాలకు స్వల్ప అంతరాయం ఏర్పడింది. తెల్లవారుజామున 3.23 గంటల నుంచి గంట పాటు రన్‌వేను మూసేసి ఇతర విమానాలను రెండో రన్‌వేపైపు మళ్లించారు. ఇక విమానం నుంచి దూకిన ప్యాసింజర్ ఎవరో ఇంకా తెలియరాలేదు. అయితే, ఆయన తమిళనాడుకు చెందిన వారని సమాచారం. ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు.

## బీజేపీకి 500 ఓట్ల ఆధిక్యం ఉన్నా రీకౌంటింగ్ కోరండి

### టీఎంసీ కౌంటింగ్ ఏజెంట్లకు మమతా బెనర్జీ దిశానిర్దేశం..

### కౌంటింగ్ కేంద్రాల వద్దే ఉండాలని ఆదేశం



**కోల్‌కతా:** దేశవ్యాప్తంగా ఎంతో ఆసక్తి రేకెత్తిస్తున్న పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల లెక్కింపునకు మరికొద్ది గంటల సమయం మాత్రమే ఉండటంతో తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన పార్టీ శ్రేణులను అప్రమత్తం చేశారు. ఆదివారం నాడు పార్టీ నేతలు మరియు కౌంటింగ్ ఏజెంట్లతో నిర్వహించిన వర్చువల్ సమావేశంలో ఆమె పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా ఏదైనా నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థికి 500 నుండి 700 ఓట్ల వరకు మాత్రమే స్వల్ప ఆధిక్యం ఉంటే, తక్షణమే రీకౌంటింగ్ కోసం డిమాండ్ చేయాలని ఆమె స్పష్టం చేశారు. ఒకవేళ ఆ మార్జిన్ 1,000 ఓట్ల వరకు ఉన్నా సరే రీకౌంటింగ్ కోరాలని ఏజెంట్లకు సూచించారు. కౌంటింగ్ ప్రక్రియలో నిఘా మరియు సమన్వయం అత్యంత కీలకమని మమతా బెనర్జీ పేర్కొన్నారు. సోమవారం ఉదయం లెక్కింపు ప్రారంభమయ్యే సమయానికి అందరూ సిద్ధంగా ఉండాలని, ఎటువంటి జాప్యం జరగకుండా ఉండేందుకు ఆదివారం రాత్రే కౌంటింగ్ కేంద్రాల వద్ద లేదా సమీపంలోని హోటళ్లలో బస చేయాలని ఆదేశించారు. గ్రామీణ మరియు సుదూర ప్రాంతాల నుండి వచ్చే అభ్యర్థులు, ఏజెంట్లు ముందుగానే చేరుకోవాలని ఆమె సూచించారు. మే 4న తాను అధికారికంగా మీడియా సమావేశం నిర్వహించే వరకు ఏ ఒక్క ఏజెంట్ కూడా కౌంటింగ్ కేంద్రాన్ని విడిచి వెళ్లరాదని కఠినంగా చెప్పారు. పశ్చిమ బెంగాల్‌లోని 294 నియోజకవర్గాల్లో టీఎంసీ 200కు పైగా స్థానాల్లో ఘనవిజయం సాధిస్తుందని మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు. అయితే, గెలుపుపై నమ్మకం ఉన్నప్పటికీ కౌంటింగ్ సమయంలో ఏమాత్రం అలసత్వం ప్రదర్శించవద్దని ఆమె హెచ్చరించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేస్తూ, ప్రతి ఓటు లెక్కింపును నిశితంగా గమనించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో బెంగాల్ ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

## పూజల పేరుతో దారుణం

### మహిళను భయపెట్టి పలుమార్లు అత్యాచారం..



**బెంగళూరు, మే 3:** పూజల పేరు చెప్పి ఓ జ్యోతిష్యుడు దారుణానికి ఒడిగట్టాడు. బ్యూటీషియన్‌పై పలుమార్లు అత్యాచారం చేశాడు. అత్యాచారం విషయం బయటకు చెబితే భర్త, కుమారుడు రక్తం కక్కుకుని చనిపోతారంటూ భయపెట్టి మరీ దారుణానికి పాల్పడ్డాడు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బెంగళూరుకు చెందిన ఓ మహిళ రాజాజీనగర్‌లో బ్యూటీపార్లర్ నడుపుతోంది. ఆమెకు కొన్ని నెలల క్రితం మోహన్ కుమార్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. పరిచయాన్ని ఆసరాగా చేసుకుని కొన్ని రకాల పూజలు చేస్తే ఆర్థికంగా వృద్ధి చెందే అవకాశం ఉందని మోహన్ ఆమెను నమ్మించాడు. 2025, జనవరి 30వ తేదీన ఆమెను రామనగరలోని పిరమిడ్ వ్యాలీకి తీసుకెళ్లాడు. నిర్మానుష్య ప్రదేశంలో ఆమెపై అత్యాచారం చేయాలని చూశాడు. తర్వాత పూజ కోసం ఆమెను మైసూర్‌లోని చాముండి హిల్స్‌కు తీసుకెళ్లాడు. అక్కడినుంచి తిరిగి వస్తున్నపుడు కారులో ఆమెపై అత్యాచారం చేశాడు. అత్యాచారం విషయం బయటకు చెబితే కుటుంబాన్ని శపిస్తానని బెదిరించాడు. ఫిబ్రవరి 10వ తేదీన మోహన్ మహిళ ఇంటికి వెళ్లాడు. ఆమె భర్త, కొడుకును బయటకు పంపించాడు. తర్వాత ఆమెపై అత్యాచారం చేశాడు. తన మాట వినకపోతే భర్త, కొడుకును చంపేస్తానని బెదిరించాడు. రోజురోజుకు అతడి వేధింపులు పెరగటంతో మహిళ తట్టుకోలేకపోయింది. పోలీసులను ఆశ్రయించింది. మోహన్‌పై ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న మోహన్ కోసం గాలిస్తున్నారు.

# ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం

- ఏసీ పేలి తొమ్మిది మంది మృతి
- ఒకే కుటుంబానికి చెందిన వారు సజీవదహనం..
- 15 మందిని రక్షించిన సిబ్బంది



**న్యూఢిల్లీ, మే 3:** దేశ రాజధాని ఢిల్లీలోని వివేక్ విహార్ ప్రాంతంలో ఆదివారం ఉదయం పెను విషాదం చోటుచేసుకుంది. ఒక ఇంట్లో ఎయిర్ కండిషనర్ (ఏసీ) అకస్మాత్తుగా పేలిపోవడంతో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ దుర్ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన తొమ్మిది మంది సజీవదహనమయ్యారు. నివాస గృహంలో అమర్చిన ఏసీ ఒక్కసారిగా పేలడంతో మంటలు క్షణాల్లో రెండో అంతస్తు మొత్తాన్ని కమ్మేశాయి. మంటల తీవ్రత ఎక్కువగా ఉండటంతో లోపల ఉన్న వారికి బయటకు వచ్చే అవకాశం లేకుండా పోయింది. ఈ ప్రమాదంలో పలువురు తీవ్రంగా గాయపడగా, వారిని వెంటనే చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రులకు తరలించారు. ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రాణాలకు తెగించి సహాయక చర్యలు చేపట్టిన సిబ్బంది, సుమారు 15 మందిని సురక్షితంగా రక్షించగలిగారు. గంటల పాటు శ్రమించిన అనంతరం మంటలు అదుపులోకి వచ్చాయి. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రాథమిక విచారణలో ఏసీ పేలుడే ప్రధాన కారణమని భావిస్తున్నారు. వేసవి కాలంలో ఎలక్ట్రానిక్ పరికరాల వాడకంపై నిపుణులు హెచ్చరిస్తున్నారు. నాసిరకం పరికరాలు వాడకూడదని, తగిన భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచిస్తున్నారు. ఈ ఘటనతో స్థానిక ప్రాంతంలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి.

# రీల్స్ పిచ్చితో ఒకరి మృతి.. నలుగురికి గాయాలు

- రంగంలోకి దిగిన ఆర్మీ..



**ఉత్తర్ ప్రదేశ్:** చిన్న పిల్లల నుంచి పండు ముసలి వరకూ చాలా మంది సోషల్ మీడియాకు అతుక్కుపోతున్నారు. అందరి లాగానే తామూ ఫేమస్ అవ్వాలని కోరుకుంటున్నారు. పాపులర్ అయ్యేందుకు రీల్స్ చేస్తూ కొంతమంది నవ్వుల పాలు అవుతుండగా.. ఏం చేసైనా సరే ఫేమస్ కావాలని మరికొంతమంది పిచ్చి పనులు చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. తాజాగా ఇలాంటి ఘటనే ఉత్తర్ ప్రదేశ్‌లో చోటు చేసుకుంది. రీల్స్ మోజు ఒకరి ప్రాణం తీయగా.. నలుగురిని ప్రాణాపాయ స్థితిలోకి నెట్టేసింది. ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రం గోరఖ్‌పూర్ జిల్లా సిద్ధార్థనగర్‌కు చెందిన ఐదుగురు చిన్నారులు శనివారం నాడు రీల్స్ చేయాలని నిర్ణయించుకున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో కాన్షీరామ్ అవాసియ్ కాలనీలోని ఓ పాడుపడిన వాటర్ ట్యాంక్ వద్దకు వెళ్లారు. దానిపైకి ఎక్కి రీల్స్ తీయాలని అనుకున్నారు. అయితే, ఆ వాటర్ ట్యాంక్ దాదాపు కూలిపోయే స్థితిలో ఉంది. ఐదుగురు కలిసి ట్యాంక్ మెట్లు ఎక్కి దాదాపు పైవరకూ చేరుకున్నారు. ఇంతలో ఒక్కసారిగా మెట్లు కుప్పకూలాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు చిన్నారులు పైనుంచి పడిపోయారు. వారిలో ఒకరు ప్రాణాలు కోల్పోగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మరో ఇద్దరు ప్రమాదం నుంచి తప్పించుకుని ట్యాంక్ పైకి ఎక్కేశారు. స్థానికుల సమాచారం మేరకు జిల్లా స్థాయి అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితిని పరిశీలించి బాలురను కాపాడేందుకు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను రంగంలోకి దింపారు. అయితే, వర్షం కారణంగా వారిని కాపాడేందుకు ఎన్‌డీఆర్‌ఎఫ్ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీంతో రాష్ట్ర అధికారుల అభ్యర్థన మేరకు సెంట్రల్ ఎయిర్ కమాండ్‌కు చెందిన ఐఏఎఫ్ ఎంఐ-17 వి5 హెలికాప్టర్ అక్కడికి చేరుకుంది. ఆదివారం ఉదయం 5:20 గంటల ప్రాంతంలో 15 నిమిషాల పాటు రెస్క్యూ ఆపరేషన్‌ను చేపట్టి ఇద్దరు చిన్నారులను కాపాడింది. దాదాపు 16 గంటలపాటు మట్నత్తం ఆపరేషన్ కొనసాగగా.. రాత్రంతా వారిద్దరూ ట్యాంక్ పైనే ఉండిపోవాల్సి వచ్చింది. చిన్నారులను కాపాడిన విషయాన్ని తెలియజేస్తూ ఎక్స్ వేదికగా భారత వైమానిక దళం పోస్ట్ పెట్టింది.

# 5 పోరాట క్షేత్రాలు.. 823 సీట్లు

### నేడు ఐదు రాష్ట్రాల్లో ఓట్ల లెక్కింపు

### తేలనున్న అభ్యర్థుల భవితవ్యం




**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా ఉత్కంఠ రేపుతున్న నాలుగు రాష్ట్రాలు మరియు ఒక కేంద్రపాలిత ప్రాంతం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలకు సమయం ఆసన్నమైంది. ఏప్రిల్ 9 నుండి 29 వరకు మొత్తం 823 స్థానాలకు జరిగిన పోలింగ్ ప్రక్రియ ముగియడంతో, సోమవారం ఉదయం 8 గంటల నుండి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించి ఎన్నికల కమిషన్ అన్ని కేంద్రాల్లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు పూర్తి చేసింది.

### పశ్చిమ బెంగాల్: హోరాహోరీ పోరు

బెంగాల్‌లో ఈసారి మార్పు ఖాయమని మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ అంచనా వేస్తున్నాయి. అధికార టీఎంసీకి గట్టి పోటీనిస్తూ బీజేపీ విజయకేతనం ఎగురవేస్తుందని సర్వేలు చెబుతున్నప్పటికీ, మమతా బెనర్జీ మాత్రం 200కు పైగా సీట్లతో తామే నాలుగోసారి అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

### కేరళ: యూడీఎఫ్‌కు మొగ్గు

కేరళలో కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ విజయం సాధిస్తుందని మెజారిటీ సర్వేలు పేర్కొన్నాయి. మొత్తం 140 సీట్లలో యూడీఎఫ్ 78 నుండి 94 వరకు స్థానాలను గెలుచుకునే అవకాశం ఉందని 'యాక్సిస్ మై ఇండియా', 'సి-ఓటర్' సర్వేలు వెల్లడించాయి.

### అస్సాం: తిరిగి బీజేపీకే పట్టం

అస్సాంలో హిమంత్ బిశ్వ శర్మ సారథ్యంలోని బీజేపీ కూటమి మూడోసారి అధికారాన్ని నిలబెట్టుకోవడం ఖాయమని ఎగ్జిట్ పోల్స్ స్పష్టం చేస్తున్నాయి. ఎన్డీయే కూటమి 85 నుండి 100 వరకు సీట్లతో క్లీన్ స్వీప్ చేసే అవకాశం ఉందని అంచనా.

### తమిళనాడు: డీఎంకే వర్సెస్ టీవీకే

తమిళనాడులో ఎంకే స్టాలిన్ సారథ్యంలోని డీఎంకే మరోసారి అధికారాన్ని ఆశిస్తుండగా, నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ అనూహ్య ఫలితాలను సాధించబోతున్నట్లు ఎగ్జిట్ పోల్స్ అంచనా వేయడం విశేషం. టీవీకే మరియు డీఎంకే కూటముల మధ్య హోరాహోరీ పోరు సాగే అవకాశం ఉందని 'యాక్సిస్ మై ఇండియా' తెలిపింది.

### పుదుచ్చేరి: ఎన్డీయే ధీమా

కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో ఎన్డీయే కూటమి తన అధికారాన్ని నిలబెట్టుకుంటుందని పోల్‌స్టర్స్ అంచనా వేశారు. మొత్తం 30 స్థానాల్లో ఎన్డీయే 15 నుండి 19 సీట్లను గెలుచుకునే అవకాశం ఉందని 'పీపుల్స్ పల్స్' సర్వే పేర్కొంది. నేడు ఉదయం ప్రారంభం కానున్న ఈ కౌంటింగ్ ప్రక్రియతో ఈ ఐదు ప్రాంతాల్లో రాబోయే ఐదేళ్ల పాలన ఎవరిదనేది తేలిపోనుంది.

## రాఘవ్ చద్దాకు రాష్ట్రపతి అపాయింట్‌మెంట్



**న్యూఢిల్లీ:** ఆమ్ ఆద్మీ పార్టీని వీడిన ఎంపీలపై పంజాబ్ ప్రభుత్వ యంత్రాంగం రాజకీయ కక్ష సాధింపునకు పాల్పడుతోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా ఫిర్యాదు చేయనున్నారు. ఈ విషయాన్ని రాష్ట్రపతి దృష్టికి తీసుకువెళ్లేందుకు అపాయింట్‌మెంట్ కోరారు. ఇందుకు రాష్ట్రపతి సానుకూలంగా స్పందించారు. మే 5న అపాయింట్‌మెంట్ ఇచ్చారు. రాజ్యసభ ఎంపీలు రాఘవ్ చద్దా, సందీప్ పాఠక్, అశోక్ మిట్టల్ గత నెలలో ఆప్‌తో తెగతెంపులు చేసుకుని బీజేపీలో చేరారు. రాజ్యసభ ఎంపీలు హర్భజన్ సింగ్, రాజిందర్ గుప్తా, విక్రమ్ జిత్ సింగ్, స్వాతి మలివాల్ సైతం బీజేపీలోకి వెళ్లిపోయారు. తమ పార్టీ నుంచి గెలిచిన ఎంపీలు బీజేపీలో విలీనమవ్వడం చట్టవిరుద్ధమని, ఈ విషయాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దృష్టికి ఈనెల 5న తీసుకువెళ్లనున్నట్టు పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ సైతం తెలిపారు. కాగా, పార్టీ మారిన కొద్దిరోజులకే ఎంపీ సందీప్ పాఠక్‌పై పంజాబ్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రెండు కేసుల్లో ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు అయింది. నాన్‌బెయిలబుల్ కేసులు కావడంతో ఆయనను అరెస్టు చేస్తారనే ప్రచారం జరిగింది. ఈ క్రమంలోనే పంజాబ్ పోలీసులు పాఠక్ పంజాబ్ నివాసం వద్ద భారీగా మోహరించడం, ఆయన ఢిల్లీలోని తన నివాసం వెనుక వైపు నుంచి కారులో అజ్ఞాత ప్రదేశంలోకి వెళ్లిపోవడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. దీనిపై రాఘవ్ చద్దా ఘాటుగా స్పందించారు. బీజేపీలో చేరిన ఎంపీలపై తప్పుడు కేసులు పెట్టడానికి పంజాబ్ ప్రభుత్వ యంత్రాంగం ప్రయత్నిస్తోందని, దీనిపై ఫిర్యాదు చేసేందుకు రాష్ట్రపతి అపాయిమెంట్ కోరానని తెలిపారు.

# కీసర పోలీసుల దాడి..
# నకిలీ రిజిస్ట్రేషన్ రాకెట్ బహిర్గతం

- కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ భూకబ్జా మోసం బయటపడింది..
- నిర్ఘూంపేట్‌కు చెందిన రిటైర్డ్ ఉద్యోగి దొప్పలపూడి రవీంద్ర ఫిర్యాదు..
- రాంపల్లి గ్రామం, సర్వే నంబర్లు 404, 405లోని ప్లాట్ నం.108 (300 గజాలు)పై వివాదం..
- అసలు యజమాని భూమిపై నకిలీ సేల్ డీడ్లు..



**కీసర, రాజముద్ర న్యూస్:**

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ భూకబ్జా మోసం వెలుగులోకి వచ్చింది. నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలు సృష్టించి, ఖాళీ ప్లాట్లను లక్ష్యంగా చేసుకుని అమాయకులను మోసం చేస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. నిర్ఘూంపేట్‌కు చెందిన రిటైర్డ్ ఉద్యోగి దొప్పలపూడి రవీంద్ర తనకు 1983లో కొనుగోలు చేసిన రాంపల్లి గ్రామంలోని సర్వే నంబర్లు 404, 405లోని ప్లాట్ నం.108 (300 గజాలు)పై ఇతరుల పేర్లతో నకిలీ సేల్ డీడ్లు నమోదయ్యాయని ఫిర్యాదు చేయడంతో ఈ కేసు వెలుగులోకి వచ్చింది. పోలీసుల విచారణలో సంచలన విషయాలు బయటపడ్డాయి. నిందితులు ఖాళీగా ఉన్న ప్లాట్లను గుర్తించి, అసలు యజమాని లేరని భావించి నకిలీ లింక్ డాక్యుమెంట్లు సృష్టించారు. డాక్యుమెంట్ రైటర్ ఉదయ్ రెడ్డి, సబ్–రిజిస్ట్రార్ రెహమాన్‌తో కుమ్మక్కై తప్పుడు రిజిస్ట్రేషన్లు చేసి, ఒకే ప్లాట్‌ను పలుమార్లు అమ్మినట్లు వెల్లడైంది. ఈ మోసంలో భాగంగా మొదట ధర్మారావు అనే నకిలీ ఓనర్‌ను సృష్టించి, అతని పేరుతో ప్రదీప్ కుమార్‌కు అమ్మకం జరిపారు. తరువాత ఆ ప్లాట్‌ను విభజించి ప్రభాకర్, నరేష్‌లకు విక్రయించారు. అనంతరం వారు కలిసి గుబ్బల వెంకటేశ్వర్ రావు (జీవీఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్)కు రిజిస్ట్రేషన్ చేసి, చివరకు జంగాల శ్రీరామ్ అతని భార్య విజయలక్ష్మి పేర్లపై రిజిస్ట్రేషన్ చేశారు. ఈ కేసులో నిందితులు అందరూ ఒక గ్రూప్‌గా పనిచేస్తూ తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో నకిలీ పత్రాలు సృష్టించి, అమాయక ప్రజలకు ప్లాట్లు అమ్మి మోసం చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కీసర పోలీసులు జంగాల శ్రీరామ్, గుబ్బల వెంకటేశ్వర్ రావు (జీవీఆర్), బందెల్ల ప్రశాంత్ (బాబి), బందెల్ల ప్రభాకర్, పోన్నబోయిన బాలకృష్ణ (బాలు), అలాగే డాక్యుమెంట్ రైటర్ ఉదయ్ రెడ్డిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచగా, వారిని జుడీష్యల్ కస్టడీకి తరలించారు. మిగిలిన నిందితుల కోసం పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ కేసును ఛేదించిన జవహర్ నగర్ ఏసీపీ చక్రపాణి, కీసర ఇన్స్పెక్టర్ ఆర్కపల్లి ఆంజనేయులు, ఎస్ఐ అనిల్ కుమార్ పోలీసు సిబ్బందిని మల్కాజిగిరి జోన్ డీసీపీ సి.హెచ్. శ్రీధర్ అభినందించారు

## డంపింగ్ యార్డ్ కు వ్యతిరేకంగా
## 9వ రోజు రిలే నిరాహార దీక్షలు



**దమ్మాయిగూడ,రాజముద్ర న్యూస్:**

దమ్మాయిగూడలో గత తొమ్మిది రోజులుగా డంపింగ్ యార్డ్ కు వ్యతిరేకంగా స్థానిక జె ఏ సీ నాయకులు, ప్రజలు రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నారు. ఆదివారం గత తొమ్మిది రోజులుగా డంపింగ్ యార్డ్ కు వ్యతిరేకంగా జే ఏ సీ నాయకులు నిరహార దీక్షలు చేస్తూ వారు మాట్లాడుతూ..జవహర్ నగర్ పరిసర ప్రాంతాల్లో గత 20 ఏళ్ల కింద కాంగ్రెస్ ప్రభుత్వం డంపింగ్ యార్డ్ కు 350 ఎకరాలు కేటాయించి జవహర్ నగర్, దమ్మాయిగూడ, నాగారం, రాంపల్లి పరిసర ప్రాంతాల ను సర్వ నాశనం చేసిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డ్ వలన స్థానిక పరిసర ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని, డంపింగ్ యార్డు కోసం చేస్తున్న నిరహార దీక్షకు పరిష్కారం వచ్చేవరకు ఇక నుంచి మా ప్రాంతాలను తామే కాపాడుకుంటామని ప్రజల మద్దతుగా, డంపింగ్ యార్డ్ కు వ్యతిరేకంగా మా పోరాటం నిరంతరం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ముప్పా రామారావు, దమ్మాయిగూడ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సంజీవరెడ్డి, దమ్మాయిగూడ మాజీ సర్పంచి, సీనియర్ నాయకుడు పాండాల యాదగిరి గౌడ్, జే ఏ సీ నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## జవహర్ నగర్ లో బీఆర్ఎస్ పార్టీలోకి భారీగా చేరికలు

- జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కు చెందిన 50 మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బిఆర్ఎస్ పార్టీ లో చేరికలు..
- మాజీ మంత్రి, మేడ్చల్ నియోజకవర్గం శాసన సభ్యులు చామకూర మల్లారెడ్డి



**జవహర్ నగర్, రాజముద్ర న్యూస్:**

బోయినపల్లి క్యాంపు కార్యాలయంలో మేడ్చల్ నియోజకవర్గం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కు చెందిన సుమారు 50మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, యువకులు కాంగ్రెస్ పార్టీని వీడి ఆదివారం మాజీ మంత్రి, మేడ్చల్ నియోజకవర్గం శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి సమక్షంలో భారత రాష్ట్ర సమితి పార్టీలోకి మూర్గాన్,ముత్తు,రాజా, మహేష్ , కుమార్, మూర్గేష్ అజయ్ శ్రీకాంత్ తదితరులు పార్టీ లో చేరడం జరిగింది. అంతరం వీరందరికి గులాబీ కండువా వేసి బిఆర్ఎస్ పార్టీ లోకి ఎమ్మెల్యే మల్లారెడ్డి సాదరంగా ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ కావ్య,బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కొండల్, పార్టీ యూత్ జర్నల్ సెక్రటరీ దిలీప్, నాయకులు రాజశేఖర్,జిట్టా శ్రీనివాస్,రెడ్డి శెట్టి మహేష్ , సతీష్,రంగుల సతీష్, శోభ రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్**

రామారెడ్డి మండలం మద్దికుంట గ్రామానికి చెందిన జడ్పిహెచ్ఎస్ పాఠశాల 2006–2007 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం చుక్కాపూర్ లక్ష్మీ నరసింహ ఆలయం వద్ద నిర్వహించడం జరిగింది, పూర్వ విద్యార్థులు తోట రంజిత్, నరేష్, రాజశేఖర్, అరవింద్ పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు, వారు చదువుకున్న పాఠశాలలో మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు, వీరికి చదువు చెప్పిన ఉపాధ్యాయులు బాలకిషన్, గోవర్ధన్, శ్రీనివాస్, బలరాం, శంకర్, చరణ్, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## శ్రీవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలకు భారీ బందోబస్తు



**కీసర,రాజముద్ర న్యూస్:**

కీసర మండలం, రాంపల్లిదాయరలోని వెంకలోనిగుట్టలో ఈనెల 6 నుంచి 9వ తేదీ వరకు హేమాద్రి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరుగు శ్రీవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలలో బాగంగా బందోబస్తు ఏర్పాట్లను ఆదివారం మల్కాజిగిరి డిసిపి శ్రీధర్, జవహర్ నగర్ ఏసీపీ చక్రపాణి, కీసర సిఐ ఆంజనేయులు పరిశీలించారు. అనంతరం వాహనాల పార్కింగ్, అన్నదానం, కల్యాణం జరిగే స్థలాలను సందర్శించారు. ఆలయ అవరణము, క్యూలైన్లు పరిశీలించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తోపాటు మంత్రులు ఇతర ప్రముఖులు ప్రతిష్టా ఉత్సవాలలో పాల్గొనే అవకాశం ఉన్నందున ఏర్పాట్లపై ఆలయ చైర్మన్ కందాడి హనుమంత్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులతో చర్చించారు



## అంగరంగ వైభవంగా
## శ్రీ కోట మైసమ్మ విగ్రహా ప్రతిష్ట మహోత్సవం

**- అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, మాజీ చైర్మన్ చంద్రారెడ్డి**

**నాగారం,మే 03, రాజముద్ర న్యూస్:**

నాగారం డివిజన్ పరిధిలోని శ్రీకోట మైసమ్మ విగ్రహా ప్రతిష్ట మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదివారం విగ్రహ ప్రాణ ప్రతిష్ట మహోత్సవానికి ఉప్పల్ నియోజకవర్గం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, నాగారం మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి లు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... శ్రీకోట మైసమ్మ కటాక్షంతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీ కంఠమహేశ్వర స్వామి ఆలయ గౌరవ చైర్మన్ గూడూరు పెంటయ్య గౌడ్, గూడూరు కృష్ణగౌడ్, గూడూరు అశోక్ గౌడ్, గూడూరు ప్రభాకర్ గౌడ్, గూడూరు శ్రీనివాస్ గౌడ్, గూడూరు ఆంజనేయులు గౌడ్, గూడూరు చక్రపాణి గౌడ్, గూడూరు రమేష్ గౌడ్, గూడూరు మహేష్ గౌడ్, గూడూరు సతీష్ గౌడ్, సుర్వి వీరేశం గౌడ్, అన్నంరాజు శ్రీనివాస్, కందాడి వెంకట్ రెడ్డి, గ్రామ ప్రజలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ కేంద్రీయ విద్యాలయం-1లో
## నీట్ పరీక్షల నిర్వహణ పై తనిఖీ



**మేడ్చల్ జిల్లా కలెక్టరేట్, రాజముద్ర న్యూస్:**

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఉప్పల్ కేంద్రీయ విద్యాలయం–1లో నిర్వహిస్తున్న నీట్ పరీక్ష నిర్వహణను ఆదివారం అదనపు జిల్లా కలెక్టర్ విజయేందర్ రెడ్డి పరిశీలించారు. నిర్వహణ ఏర్పాట్లపై కళాశాల యాజమాన్యాన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థిని విద్యార్థులకు మంచినీరు, కరెంటు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అదేవిధంగా పరీక్ష కేంద్రాలలో మెడికల్ కిట్ అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. పరీక్ష ప్రశాంతంగా నిర్వహించాలని సంబంధిత యాజమాన్యాలకు అదనపు కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో మేడిపల్లి ఎమ్మార్వో నరసింహారెడ్డి, కళాశాల యాజమాన్యం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## సైబరాబాద్ కమిషనరేట్ లో 65 మంది ఇన్ స్పెక్టర్ల బదిలీకి బ్రేక్

**హైదరాబాద్, మే 3 :**

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శనివారం రాత్రి 65 ఇన్స్పెక్టర్ లను బదిలీ చేస్తూ వెలువడిన ఉత్తర్వులు వివాదాస్పదంగా మారింది. ఈ ఉత్తర్వులను హోల్డ్ లో పెడుతున్నట్లు స్వయంగా సీపీ ఆదివారం ఉదయం మౌఖికంగా చెప్పడంతో ఇన్స్పెక్టర్ లు గందరగోళంలో పడ్డారు. ఉత్తర్వులు ఇచ్చిన పోలీస్ బాస్ ఆ పోస్టింగ్ లలో ఎవరు బాధ్యతలు తీసుకోవద్దని చెప్పడంతో ఈ బదిలీల పై రాజకీయ ఒత్తిడి ఉందని పోలీస్ వర్గాలు అంటున్నాయి. పొలిటికల్ దెబ్బకు ఒకసారిగా బదిలీలు నిలిచిపోయాయని తెలుస్తోంది. మరో వైపు ఈ బదిలీలు సక్రమంగా జరగలేదని ఆరోపణలు ఉన్నాయి. జోన్ స్థాయి అధికారులకు సన్నిహితంగా ఉండి వారు చెప్పినట్లు పనిచేసిన వారికి, నచ్చిన వారికి కీలక పోస్టింగ్ లు దక్కాయనే విమర్శలు ఉన్నాయి. ఇక రాజకీయ పుష్కలంగా అండదండలు ఉన్న వారికీ సైబరాబాద్ లోనే ప్రధాన పోస్టింగ్ లు దక్కాయని పోలీస్ వర్గాలు గుసగుసలాడుతున్నాయి. ఏదేమైనా పనిచేసే వారిని కాకుండా పైరవికారులకు పెద్ద పీట వేశారని పోలీస్ వర్గాలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నాయి.

## అల్లిపూర్‌లో గ్రామంలో మొక్కజొన్న పంట దగ్ధం

**నాగర్‌కర్నూల్, మే3:**

నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం అల్లిపూర్ గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నిప్పు రవ్వలు ఎగిసి పడి మొక్కజొన్న పంట పూర్తిగా దగ్ధమైన ఘటన చోటుచేసుకుంది.గ్రామానికి చెందిన రైతు డొక్కా శ్రీనివాసులు 2.10 గుంటల భూమిలో సాగు చేసిన మొక్కజొన్న పంట కోతకు సిద్ధంగా ఉన్న సమయంలో అగ్ని ప్రమాదానికి గురై పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటనతో సుమారు రూ.2 లక్షలకు పైగా నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు.స్థానికుల సమాచారం ప్రకారం, సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నిప్పు రవ్వలు ఎగిసి పొలంలో పడటంతో మంటలు వేగంగా వ్యాపించాయి. సమాచారం అందేసరికే పంట మొత్తం అగ్నికి ఆహుతైంది.ఈ ఘటనపై రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తున్నారు. అప్పుల్లో ఉన్న రైతు శ్రీనివాసులు పంట నష్టంతో తీవ్ర మనోవేదనకు గురయ్యారు. బాధిత రైతును ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. రైతు సంఘాలు, ప్రజాప్రతినిధులు కూడా తగిన పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



# రోజూ ఒక నారింజ పండును తప్పనిసరిగా తినాల్సిందే..



నారింజ పండ్లు మనకు ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ అందుబాటులో ఉంటాయి. చలికాలం సీజన్ లో ఇవి మనకు మార్కెట్‌లో ఎక్కువగా దర్శనమిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో అత్యధిక మొత్తంలో లభించే పండ్లలో నారింజ పండు కూడా ఒకటి. నారింజ పండ్లను అనేక రకాలుగా తీసుకోవచ్చు. వీటిని నేరుగా అలాగే తినవచ్చు. లేదా జ్యూస్ చేసి తాగవచ్చు. ఇతర పండ్లతో కలిపి సలాడ్ రూపంలోనూ తినవచ్చు. అనారోగ్య సమస్యలు ఉన్నవారికి నారింజ పండ్లను తినాలని వైద్యులు చెబుతుంటారు. ఈ పండ్లలో అనేక పోషకాలు ఉంటాయి. ఇవి మనకు అనేక లాభాలను అందిస్తాయి. రోజూ కచ్చితంగా ఒక నారింజ పండును తినాలని, దీంతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని పోషకాహార నిపుణులు సైతం సూచిస్తున్నారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరు ఈ పండ్లను కచ్చితంగా రోజూ తినాలని వారు చెబుతున్నారు.



**విటమిన్ సి..**

నారింజ పండ్లలో అధిక మొత్తంలో విటమిన్ సి ఉంటుంది. విటమిన్ సి అధికంగా లభించే పండ్లలో నారింజ పండు ముందు వరుసలో నిలుస్తుంది. ఒక మీడియం సైజు నారింజ పండును తింటే మనకు రోజుకు కావల్సిన విటమిన్ సిలో 100 శాతం లభిస్తుంది. విటమిన్ సి వల్ల రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. ముఖ్యంగా సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. దగ్గు, జలుబు తగ్గుతాయి. విటమిన్ సి వల్ల చర్మానికి సైతం ఎంతో మేలు జరుగుతుంది. ఇది శరీరంలో కొల్లాజెన్ ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. దీని వల్ల చర్మం సాగే గుణాన్ని పొందుతుంది. చర్మం కాంతివంతంగా మారి మెరుస్తుంది. వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. యవ్వనంగా కనిపిస్తారు. విటమిన్ సి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా కూడా పనిచేస్తుంది. ఇది ఫ్రీ ర్యాడికల్స్‌ను తొలగిస్తుంది. క్యాన్సర్ కణాలను నాశనం చేస్తుంది. దీని వల్ల పెద్ద పేగు క్యాన్సర్ రాకుండా అడ్డుకోవచ్చు.


o.r.a.n.g.e.

**గుండె ఆరోగ్యానికి..**

నారింజ పండ్లను తినడం వల్ల విటమిన్ బి6 అధికంగా లభిస్తుంది. ఇది హిమోగ్లోబిన్ ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. దీంతో ఎర్ర రక్త కణాలు వృద్ధి చెందుతాయి. రక్తం తయారవుతుంది. రక్తహీనత తగ్గుతుంది. అలాగే శరీరంలో రక్త సరఫరా మెరుగు పడుతుంది. దీంతో బీపీ తగ్గుతుంది. హైబీపీ ఉన్నవారికి నారింజ పండ్లు ఎంతో మేలు చేస్తాయి. రోజూ ఒక నారింజ పండును తింటుంటే ఎంతో మేలు జరుగుతుంది. ఈ పండ్లను తింటుంటే కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. రక్తనాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. నారింజ పండ్లలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణశక్తి పెరిగేలా చేస్తుంది. దీని వల్ల ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. అజీర్తి ఉండదు. మలబద్దకం తగ్గుతుంది. జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది.

**డయాబెటిస్ ఉన్నవారు కూడా..**

డయాబెటిస్ ఉన్నవారు సైతం నారింజ పండ్లను తినవచ్చు. ఇందులో భయం చెందాల్సిన పనిలేదు. నారింజ పండ్లను తింటే షుగర్ పెరుగుతుందని అనుకుంటారు. కానీ ఇది అపోహే. ఇందులో నిజం లేదు. ఎందుకంటే నారింజ పండు గ్లైసీమిక్ ఇండెక్స్ విలువ 40గా ఉంటుంది. అందువల్ల ఈ పండును తింటే షుగర్ లెవల్స్ అమాంతం పెరగవు. పైగా ఈ పండ్లలో ఉండే విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్ షుగర్ లెవల్స్‌ను తగ్గించేందుకు సహాయం చేస్తాయి. కనుక డయాబెటిస్ ఉన్నవారు కూడా నిరభ్యంతరంగా ఈ పండ్లను రోజూ తినవచ్చు. ఇందులో సందేహించాల్సిన పనిలేదు. ఇక ఈ పండ్లలో సిట్రేట్స్ అధిక మొత్తంలో ఉంటాయి. ఇవి కిడ్నీల్లో స్టోన్లు ఏర్పడకుండా చూస్తాయి. అందువల్ల కిడ్నీ స్టోన్లు ఉన్నవారికి మేలు జరుగుతుంది. అలాగే మూత్రం పీహెచ్ స్థాయిలు సరైన రీతిలో ఉంటాయి. దీని వల్ల మూత్రాశయం, కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయి. ఇలా నారింజ పండును రోజుకు ఒకటి చొప్పున తింటుంటే అనేక లాభాలను పొందవచ్చు.



## రోజూ 30 నిమిషాల పాటు స్కిప్పింగ్ చేస్తే..

### ఎన్ని అద్భుతమైన లాభాలు కలుగుతాయో తెలుసా..?

ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ వ్యాయామం చేయాలన్న విషయం అందరికీ తెలిసిందే. ఒకప్పుడు ప్రజలు శారీరక శ్రమ ఎక్కువగా చేసేవారు. రోజూ ఏదో ఒక పనిలో నిమగ్నమై ఉండేవారు. దీంతో వారికి చక్కని వ్యాయామం జరిగేది. దీని వల్ల వారు ఆరోగ్యంగా ఉండేవారు. వృద్ధాప్యం వచ్చినా శారీరక దారుఢ్యం ఉండేది. కానీ ప్రస్తుతం యుక్త వయస్సులోనే అన్ని రోగాలను కొని తెచ్చుకుంటున్నారు. ఇందుకు ప్రధాన కారణం వ్యాయామం లేదా శారీరక శ్రమ లేకపోవడమే అని చెప్పవచ్చు. కనుక ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలంటే కచ్చితంగా రోజూ వ్యాయామం చేయాల్సి ఉంటుంది. అయితే మనకు అనేక రకాల వ్యాయామాలు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో చాలా మంది తమకు సౌకర్యవంతంగా ఉండే వ్యాయామాలను చేస్తుంటారు. ఇక అలాంటి వ్యాయామాల్లో స్కిప్పింగ్ కూడా ఒకటి. దీన్నే రోప్ జంపింగ్ లేదా స్కిప్పింగ్ రోప్స్ అని కూడా పిలుస్తారు. ఈ వ్యాయామాన్ని చాలా మంది చేస్తుంటారు. అయితే దీన్ని రోజూ చేయడం వల్ల మనకు అనేక లాభాలు కలుగుతాయి.

**గుండెకు చక్కని వ్యాయామం..**

స్కిప్పింగ్ ను రోజూ కనీసం 30 నిమిషాల పాటు చేస్తే ఎన్నో లాభాలు ఉంటాయని ఫిట్ నెస్ నిపుణులు చెబుతున్నారు. అయితే స్కిప్పింగ్ అసలు అలవాటు లేని వారు రోజుకు 30 నిమిషాలు చేయడం కష్టం అవుతుంది. కనుక ముందుగా 5 నిమిషాలతో ప్రారంభించాలి. క్రమంగా ఆ సమయాన్ని పెంచుతూ పోవాలి. దీని వల్ల రోజూ 30 నిమిషాల పాటు స్కిప్పింగ్ చేసే సామర్థ్యం వస్తుంది. ఇలా ఈ వ్యాయామం చేస్తే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. స్కిప్పింగ్ వల్ల గుండెకు చక్కని వ్యాయామం అవుతుంది. దీన్ని అత్యుత్తమ, ఖర్చు లేని కార్డియో వ్యాయామంగా చెప్పవచ్చు. దీని వల్ల శరీరంలోని అన్ని అవయవాలకు రక్తం, ఆక్సిజన్ సరఫరా సక్రమంగా అవుతాయి. రక్త సరఫరా మెరుగు పడుతుంది. బీపీ నియంత్రణలో ఉంటుంది. గుండె ఆరోగ్యం మెరుగు పడుతుంది. హార్ట్ ఎటాక్ రాకుండా చూసుకోవచ్చు.

**కొవ్వు కరుగుతుంది..**

స్కిప్పింగ్ వల్ల శ్వాసకోశ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. శరీరంలోని అన్ని భాగాలకు ఆక్సిజన్ సరఫరా పెరుగుతుంది. కార్బన్ డయాక్సైడ్ సులభంగా బయటకు వెళ్లిపోతుంది. స్కిప్పింగ్ చేయడం వల్ల శరీరంలోని అన్ని అవయవాలకు చక్కని వ్యాయామం అవుతుంది. ముఖ్యంగా పొట్ట, తొడలు, పిరుదులకు చక్కని వ్యాయామం అవుతుంది. దీంతో ఆయా భాగాల్లో ఉండే కొవ్వు కరుగుతుంది. శరీరం సన్నగా నాజూగ్గా మారుతుంది. కండరాలు దృఢంగా మారి చక్కని దేహ దారుఢ్యం సొంతమవుతుంది. శరీరంలో శక్తి సామ ర్థ్యాలు పెరుగుతాయి. యాక్టివ్‌గా ఉంటారు. ఉత్సాహం గా పనిచేస్తారు. నీరసం, అలసట ఉండవు. బద్ధ కం పోతుంది. ఈ వ్యాయామం చేయడం వల్ల శరీరం లోని కొవ్వు సులభంగా కరిగిపోతుంది. రోజూ 30 నిమి షాల పాటు స్కిప్పింగ్ చేస్తే శరీరం సుమారుగా 300 క్యాలరీల వరకు శక్తిని ఖర్చు చేస్తుంది. దీంతో ఎంతో మేలు జరుగుతుంది. అధిక బరువు సులభంగా తగ్గుతారు.

**ఎముకల ఆరోగ్యానికి..**

స్కిప్పింగ్ చేయడం వల్ల చర్మం సైతం సురక్షితంగా ఉంటుంది. చర్మానికి రక్త సరఫరా పెరుగుతుంది. పోషకాలు లభిస్తాయి. వ్యర్థాలు సులభంగా బయటకు వెళ్లిపోతాయి. చర్మం శుభ్రంగా మారుతుంది. ఆరోగ్యంగా ఉంటుంది. కాంతివంతంగా మారి మెరుస్తుంది. వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. యవ్వనంగా కనిపిస్తారు. సాధారణంగా వయస్సు మీద పడే కొద్దీ ఎముకలు బలహీనంగా మారుతాయి. దీనికి క్యాల్షియం లోపం తోడైతే ఎముకలు పెళుసుగా మారి త్వరగా విరిగిపోయేందుకు అవకాశాలు ఉంటాయి. అయితే రోజూ స్కిప్పింగ్ చేస్తే వృద్ధాప్యంలో ఎముకల సంబంధిత సమస్యలు వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయని సైంటిస్టులు తమ పరిశోధనల్లో తేల్చారు. స్కిప్పింగ్ చేయడం వల్ల వృద్ధాప్యంలో ఎముకలు చాలా బలంగా మారుతాయి. ఇలా ఈ వ్యాయామం మనకు ఎంతో మేలు చేస్తుంది. కనుక రోజూ స్కిప్పింగ్ చేయడం మరిచిపోకండి.

# అధిక బరువుతో అవస్థలు పడుతున్నారా..?

## అయితే ఈ పండ్లను రోజూ తినండి, ఎంతో మేలు జరుగుతుంది..!

ప్రస్తుతం చాలా మంది అధిక బరువు సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. శరీరంలో అధికంగా చేరిన కొవ్వును కరిగించుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. అధికంగా బరువు పెరిగేందుకు అనేక కారణాలు ఉంటాయి. శారీరక శ్రమ లేకపోవడం, గంటల తరబడి ఒకే చోట కూర్చుని పనిచేయడం, వేళకు భోజనం చేయకపోవడం, అతిగా తినడం, జంక్ ఫుడ్ ఎక్కువగా తినడం, థైరాయిడ్ వంటి దీర్ఘకాలిక అనారోగ్యాలు ఉండడం వంటివి అధికంగా బరువు పెరిగేలా చేస్తాయి. బరువు అధికంగా ఉన్నవారు కచ్చితంగా తగిన జాగ్రత్తలను పాటించాల్సి ఉంటుంది. రోజూ వ్యాయామం చేయాలి. వేళకు భోజనం చేయాలి. తగినన్ని గంటలపాటు నిద్రించాలి. జంక్ ఫుడ్ తినడం తగ్గించాలి. అలాగే ఆహారం విషయంలో అనేక మార్పులు చేసుకోవాలి. ముఖ్యంగా కొన్ని రకాల పండ్లను తింటుండాలి. దీని వల్ల శరీరంలోని కొవ్వు కరిగి బరువు తగ్గుతారు.

**బెర్రీలు, యాపిల్..**

అధిక బరువు తగ్గేందుకు గాను బెర్రీ పండ్లు ఎంతో దోహదం చేస్తాయి. స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీలు, రాస్ప్ బెర్రీల వంటి బెర్రీ పండ్లను రోజూ తింటుంటే ఎంతగానో ఉపయోగం ఉంటుంది. ఈ పండ్లలో ఫైబర్ అధికంగా ఉంటుంది. అందువల్ల వీటిని తింటే కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు ఎంతో సహాయం చేస్తుంది. ఈ పండ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు సైతం బరువు తగ్గేందుకు దోహదం చేస్తాయి. రోజూ ఒక యాపిల్ పండును తింటుంటే డాక్టర్ వద్దకు వెళ్లాల్సిన అవసరమే రాదు అని అంటుంటారు. ఆ ప్రకారమే రోజూ ఒక యాపిల్ పండును తింటుంటే శరీరంలోని కొవ్వును కరిగించుకుని అధిక బరువును తగ్గించుకోవచ్చు. బరువు తగ్గేలా చేయడంలో యాపిల్స్ ఎంతో మేలు చేస్తాయి. వీటిల్లో ఉండే ఫైబర్ బరువును నియంత్రణలో ఉంచుతుంది.



**గ్రేప్ ఫ్రూట్, పుచ్చకాయలు..**

అధిక బరువు సమస్యతో బాధపడుతున్నవారికి గ్రేప్ ఫ్రూట్ కూడా ఎంతో మేలు చేస్తాయి. వీటిల్లో క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. అందువల్ల వీటిని తింటే బరువు తగ్గేందుకు అవకాశాలు ఉంటాయి. ఈ పండ్లను తినడం వల్ల మెటబాలిజం సైతం పెరుగుతుంది. దీంతో క్యాలరీలు ఖర్చవుతాయి. కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. ఈ పండ్లలో అధికంగా ఉండే విటమిన్లు సి, ఎ బరువు తగ్గేందుకు సహాయం చేస్తాయి. పుచ్చకాయలు మనకు కేవలం వేసవిలోనే కాదు, ప్రస్తుతం అన్ని సీజన్లలోనూ అందుబాటులో ఉంటున్నాయి. అందువల్ల పుచ్చకాయలను తింటే ఎంతో మేలు జరుగుతుంది. ముఖ్యంగా ఈ పండ్లను తింటే కడుపు నిండిన భావన కలిగి ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. ఆహారం తక్కువగా తినేలా చేస్తాయి. దీని వల్ల బరువు తగ్గడం తేలికవుతుంది.

**పియర్స్, కివి, అవకాడో..**

పియర్స్ పండ్లను రోజువారి ఆహారంలో భాగం చేసుకున్నా కూడా మేలు జరుగుతుంది. ఈ పండ్లు కూడా బరువును తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తాయి. ఈ పండ్లలోనూ ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. బరువు తగ్గేలా చేస్తుంది. ఈ పండ్లలో ఉండే విటమిన్ సి రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. శరీరం ఆరోగ్యంగా ఉండేలా చూస్తుంది. రోజూ ఒక కివి పండును తింటున్నా కూడా ఎంతో ఉపయోగం ఉంటుంది. కివి పండ్లను తింటే ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. అజీర్తి ఉండదు. శరీరంలో కొవ్వు పేరుకుపోకుండా చూసుకోవచ్చు. దీని వల్ల అధిక బరువు తగ్గుతారు. రోజూ ఒక అవకాడోను తింటున్నా కూడా అధిక బరువును తగ్గించుకోవచ్చు. ఈ పండ్లలో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు గుండెను ఆరోగ్యంగా ఉంచడమే కాకుండా బరువు తగ్గేందుకు కూడా దోహదం చేస్తాయి. ఇలా ఆయా రకాల పండ్లను తరచూ తింటుంటే అధిక బరువును సులభంగా తగ్గించుకోవచ్చు. ఆరోగ్యంగా ఉండవచ్చు. ప్రస్తుతం చాలా మంది అధిక బరువు సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. శరీరంలో అధికంగా చేరిన కొవ్వును కరిగించుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. అధికంగా బరువు పెరిగేందుకు అనేక కారణాలు ఉంటాయి. శారీరక శ్రమ లేకపోవడం,

గంటల తరబడి ఒకే చోట కూర్చుని పనిచేయడం, వేళకు భోజనం చేయకపోవడం, అతిగా తినడం, జంక్ ఫుడ్ ఎక్కువగా తినడం, థైరాయిడ్ వంటి దీర్ఘకాలిక అనారోగ్యాలు ఉండడం వంటివి అధికంగా బరువు పెరిగేలా చేస్తాయి. బరువు అధికంగా ఉన్నవారు కచ్చితంగా తగిన జాగ్రత్తలను పాటించాల్సి ఉంటుంది. రోజూ వ్యాయామం చేయాలి. వేళకు భోజనం చేయాలి. తగినన్ని గంటలపాటు నిద్రించాలి. జంక్ ఫుడ్ తినడం తగ్గించాలి. అలాగే ఆహారం విషయంలో అనేక మార్పులు చేసుకోవాలి. ముఖ్యంగా కొన్ని రకాల పండ్లను తింటుండాలి. దీని వల్ల శరీరంలోని కొవ్వు కరిగి బరువు తగ్గుతారు.

## ఐపీఎల్‌లో 200 వికెట్లు తీసిన తొలి విదేశీ ప్లేయర్‌గా సునీల్ నరైన్ రికార్డ్!

ఐపీఎల్ (IPL 2026) చరిత్రలో కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు వెన్నెముకగా నిలిచే సునీల్ నరైన్ మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో నరైన్ ఈ అద్భుతమైన మైలురాయిని చేరుకున్నాడు. ఈ మ్యాచ్‌లో తన మొదటి వికెట్ పడగొట్టడం ద్వారా ఐపీఎల్ లో 200 వికెట్లు పూర్తి చేసుకున్న మొదటి విదేశీ ప్లేయర్ గా అతను రికార్డ్ సృష్టించాడు. ఓవరాల్‌గా చూస్తే ఈ లీగ్ లో 200 వికెట్ల డబుల్ సెంచరీ మార్కును అందుకున్న మూడో బౌలర్‌గా నరైన్ నిలిచాడు.

**ఎలైట్ లిస్టులో నరైన్..**

ఐపీఎల్ లో ఇప్పటివరకు కేవలం ఇద్దరు బౌలర్లు మాత్రమే 200 వికెట్ల క్లబ్‌లో ఉన్నారు. రాజస్థాన్ రాయల్స్ స్పిన్నర్ యుజువేంద్ర చాహల్ (228 వికెట్లు), రాయల్ చాలెంజర్స్ బెంగళూరు పేసర్ భువనేశ్వర్ కుమార్ (215 వికెట్లు) ఈ జాబితాలో ముందు వరుసలో ఉండగా, ఇప్పుడు నరైన్ వారి సరసన చేరాడు. 197 ఐపీఎల్ మ్యాచ్‌ల్లో 25 సగటుతో నరైన్ ఈ 200 వికెట్ల మార్కును చేరుకున్నాడు. అయితే ఇక్కడ ఒక విశేషం ఉంది. 2012లో తన ఐపీఎల్ కెరీర్ ప్రారంభించినప్పటి నుండి నరైన్ కేవలం కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టుకే ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. దీంతో ఒకే ఫ్రాంచైజీ తరపున ఆడుతూ 200 వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా అతను చరిత్రపుటల్లో నిలిచాడు.

**అద్భుతమైన ఎకానమీ రేట్..**

నరైన్ బౌలింగ్ లో కేవలం వికెట్లు తీయడమే కాదు, పరుగులను నియంత్రించడంలో కూడా అతను దిట్ట. ఐపీఎల్ చరిత్రలో 100 కంటే ఎక్కువ వికెట్లు తీసి, 7 లోపు ఎకానమీ రేట్ (6.8) కలిగిన ఏకైక బౌలర్ సునీల్ నరైన్ మాత్రమే. బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టే అతని బౌలింగ్ శైలి ఇప్పటికీ అంతుచిక్కని మిస్టరీగానే ఉంది. ఐపీఎల్ లో అత్యధిక సార్లు నాలుగు వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో కూడా నరైన్ రెండో స్థానంలో ఉన్నాడు. అతను ఇప్పటివరకు 8 సార్లు ఈ ఘనత సాధించగా, చాహల్ 9 సార్లు ఈ ఫీట్ చేశాడు. నరైన్ గణాంకాల్లో ఒక ఫైవ్ వికెట్ హాల్ (Fifer) , ఒక హ్యాట్రిక్ కూడా ఉండటం విశేషం.

**ఆల్ రౌండర్ గా తిరుగులేని ప్రదర్శన..**

నరైన్ కేవలం బౌలర్ గానే కాకుండా బ్యాటర్ గా కూడా విధ్వంసం సృష్టించగలడు. ఐపీఎల్ లో అతను ఇప్పటివరకు 1,820 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ , 7 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అతని స్ట్రైక్ రేట్ 165.30గా ఉండటం గమనార్హం. ఐపీఎల్ చరిత్రలో 1,000 పరుగులు మరియు 200 వికెట్లు తీసిన తొలి ఆల్ రౌండర్ గా అతను సరికొత్త రికార్డ్ నెలకొల్పాడు. అతని అద్భుతమైన ఆటతీరుకు గుర్తింపుగా మూడు సీజన్లలో (2012, 2018 మరియు 2024) 'మోస్ట్ వ్యాల్యూబుల్ ప్లేయర్' (MVP) అవార్డును గెలుచుకున్నాడు. ఏ ఇతర ప్లేయర్ కూడా రెండు సార్ల కంటే ఎక్కువ ఈ అవార్డును గెలవలేదు.

**టీ20 క్రికెట్ లో టాప్ 3..**

ఓవరాల్ టీ20 క్రికెట్ లో కూడా నరైన్ రికార్డులు కళ్లు చెదిరేలా ఉన్నాయి. మొత్తం 591 మ్యాచుల్లో అతను 621 వికెట్లు తీశాడు. 6.17 ఎకానమీ రేట్ తో పరుగులు ఇస్తూ బ్యాటర్లను కట్టడి చేస్తున్నాడు. అతని కెరీర్ లో 12 సార్లు నాలుగు వికెట్ల ప్రదర్శనలు, ఒకసారి ఐదు వికెట్ల ప్రదర్శన ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా టీ20 ఫార్మాట్ లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లలో రషీద్ ఖాన్ (712), డ్వేన్ బ్రావో (631) తర్వాత నరైన్ మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. కెరీర్ చివరి దశలో ఉన్నా సరే, అతని బౌలింగ్ లో పదును ఏమాత్రం తగ్గలేదు. అందుకే అతన్ని కేకేఆర్ జట్టు తమ అత్యంత విలువైన ఆటగాడిగా చూసుకుంటుంది.

# ఎస్ఆర్‌హెచ్ ఆరో విజయానికి కళ్లెం వేసిన కేకేఆర్




ఐపీఎల్ 2026 సీజన్ అత్యంత ఉత్సాహభరితంగా సాగుతోంది. ముఖ్యంగా సన్‌రైజర్స్ హైదరాబాద్ (SRH) యువ బ్యాటర్ అభిషేక్ శర్మ తన అద్భుతమైన ఫామ్‌తో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. కోల్‌కతా నైట్ రైడర్స్ (KKR) తో జరిగిన 45వ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓటమి పాలైనప్పటికీ, వ్యక్తిగత ప్రదర్శనలో అభిషేక్ శర్మ తన ముద్రను వేయగలిగాడు. తన దూకుడుతో కూడిన బ్యాటింగ్ శైలి ద్వారా అత్యధిక పరుగులు సాధించిన ఆటగాళ్ల జాబితాలో మొదటి స్థానానికి చేరుకుని, ప్రతిష్టాత్మకమైన 'ఆరెంజ్ క్యాప్' ను దక్కించుకున్నాడు. అంతకముందు ఇది కేఎల్ రాహుల్ దగ్గర ఉండగా.. నేడు 15 పరుగులు చేసిన అభిషేక్ శర్మకు ఈ క్యాప్ మళ్లీ వచ్చింది. జట్టు విజయానికి దూరమైనా, అతని వ్యక్తిగత ప్రతిభ మాత్రం ఈ సీజన్‌లో హాట్ టాపిక్ గా మారింది.

ప్రస్తుత ఐపీఎల్ 2026 సీజన్‌లో అభిషేక్ శర్మ ఒక పవర్‌హౌస్‌లా కనిపిస్తున్నాడు. అతని గణాంకాలు చూస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. 10 మ్యాచ్‌లలో అభిషేక్ శర్మ మొత్తం 440 పరుగులు చేసి ఆరెంజ్ క్యాప్ రేసులో అగ్రస్థానంలో ఉన్నాడు. 48.89 సగటుతో పరుగులు సాధిస్తూ నిలకడను ప్రదర్శిస్తున్నాడు. టీ20 ఫార్మాట్‌కు తగ్గట్టుగా 206.57 అద్భుతమైన స్ట్రైక్ రేట్‌తో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడుతున్నాడు. ఈ సీజన్‌లో అతని అత్యుత్తమ స్కోరు 135 నాటౌట్. ఇప్పటివరకు 1 సెంచరీ మరియు 3 హాఫ్ సెంచరీలు నమోదు చేశాడు. తన ఇన్నింగ్స్‌లలో మొత్తం 41 ఫోర్లు , 32 సిక్సర్లు బాదాడు. కేఎల్ రాహుల్ (433 పరుగులు), హెన్రిచ్ క్లాసెన్ (425 పరుగులు) వంటి దిగ్గజ ఆటగాళ్లను వెనక్కి నెట్టి అభిషేక్ నంబర్ 1 స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. కేకేఆర్ జట్టు 7 వికెట్ల తేడాతో విజయం సాధించినప్పటికీ.. అభిషేక్ వ్యక్తిగత పోరాటం ఆరెంజ్ క్యాప్ రూపంలో ఫలించింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు అతడు ప్రధాన బలంగా మారాడు. అతని దూకుడు ఇలాగే కొనసాగితే ఈ సీజన్ ముగిసేసరికి మరిన్ని రికార్డులు సృష్టించే అవకాశం ఉంది. ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. వరుస విజయాలతో దూసుకుపోతూ, ఈ మ్యాచ్‌లో గెలిచి ఆరో విజయాన్ని తన ఖాతాలో వేసుకోవాలని భావించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ (SRH) ఆశలపై కేకేఆర్ నీళ్లు చల్లింది. తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్‌ను తక్కువ స్కోరుకే పరిమితం చేసిన కోల్‌కతా, అనంతరం 18.2 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. అంగ్క్రిష్ రఘువంశీ (59) బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడగా, అజింక్య రహానే (43) అతనికి చక్కని సహకారం అందించారు. ఈ ఓటమితో సన్‌రైజర్స్ విజయ పరంపరకు బ్రేక్ పడటమే కాకుండా, పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి వెళ్లే అవకాశం చేజారింది. కేకేఆర్ బౌలర్లు, బ్యాటర్లు సమిష్టిగా రాణించి హైదరాబాద్ జట్టుకు చుక్కలు చూపారు.




## రూ.15,600 కోట్ల భారీ డీల్

### రాజస్థాన్ రాయల్స్‌కు కొత్త యజమాన్యం

ఐపీఎల్‌లో అత్యంత ప్రజాదరణ కలిగిన ఫ్రాంచైజీల్లో ఒకటైన రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యంలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రముఖ పారిశ్రామికవేత్త లక్ష్మీ ఎన్. మిట్టల్ కుటుంబం, సీరమ్ ఇన్‌స్టిట్యూట్ అధినేత అదర్ పూనావాలాతో కలిసి ఈ ఫ్రాంచైజీని కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదుర్చుకుంది. మనోజ్ బదాలే నేతృత్వంలోని ప్రస్తుత కన్సార్టియం నుంచి ఈ జట్టును సుమారు 1.65 బిలియన్ అమెరికన్ డాలర్లకు (దాదాపు రూ.15,600 కోట్లు) సొంతం చేసుకోనున్నారు. ఐపీఎల్ చరిత్రలోనే ఇది అత్యంత విలువైన ఒప్పందాల్లో ఒకటిగా నిలిచింది.

మొదట అమెరికన్ వ్యాపారవేత్త కల్ సోమానీ కన్సార్టియం 1.63 బిలియన్ డాలర్ల బిడ్‌తో ముందుకొచ్చినా, నిధుల సమీకరణ సమస్యలు, డ్యూ డిలిజెన్స్ ప్రక్రియలో వచ్చిన ఇబ్బందుల వల్ల ఆ డీల్ రద్దైంది. దీంతో మిట్టల్ కుటుంబం రంగప్రవేశం చేసి అదర్ పూనావాలాతో కలిసి రాజస్థాన్ రాయల్స్‌ను చేజిక్కించుకుంది.

కొత్త యాజమాన్య నిర్మాణం ప్రకారం మిట్టల్ కుటుంబం దాదాపు 75 శాతం మెజారిటీ వాటాను కలిగి ఉండగా, అదర్ పూనావాలా సుమారు 18 శాతం వాటా దక్కించుకోనున్నారు. మిగిలిన వాటా మనోజ్ బదాలే సహా ప్రస్తుత పెట్టుబడిదారుల వద్ద కొనసాగనుంది.

ఈ ఒప్పందంలో కేవలం ఐపీఎల్ జట్టు మాత్రమే కాకుండా, పార్ల్ రాయల్స్ (దక్షిణాఫ్రికా టీ20 లీగ్), బార్బడోస్ రాయల్స్ (కరీబియన్ ప్రీమియర్ లీగ్) జట్లు కూడా భాగస్వామ్యంగా ఉన్నాయి. యాజమాన్య మార్పు అనంతరం బోర్డులో లక్ష్మీ మిట్టల్, ఆదిత్య మిట్టల్, వనిషా మిట్టల్-భాటియా, అదర్ పూనావాలా, మనోజ్ బదాలే కొనసాగనున్నారు.

మనోజ్ బదాలే తన అనుభవంతో కొత్త యాజమాన్యానికి వ్యూహాత్మక సలహాదారుడిగా ఉండనుండగా, ఈ ఒప్పందం 2026 మూడో త్రైమాసికంలో పూర్తి కావచ్చని అంచనా. అయితే బీసీసీఐ, సీసీఐ, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సహా సంబంధిత నియంత్రణ సంస్థల ఆమోదం అనంతరమే ఇది అధికారికంగా అమల్లోకి రానుంది.




# ఆ నలుగురికి ఇదే తొలి, చివరి సీజన్

**ఇండియన్ ప్రీమియర్ లీగ్ (IPL) అంటేనే ప్రతిభకు పట్టాభిషేకం. ఇక్కడ రాణించిన వారు రాత్రికి రాత్రే స్టార్‌లుగా మారిపోతారు. వైభవ్ సూర్యవంశీ, అన్షు ల్ కాంబోజ్ వంటి యువ ఆటగాళ్లు తమ సత్తా చాటుతూ చరిత్ర సృష్టిస్తుంటే, మరికొందరు మాత్రం ఒత్తిడికి చిత్తవుతున్నారు. ముఖ్యంగా ఈ ఏడాది అరంగేట్రం చేసిన కొందరు ఆటగాళ్లు తమ ప్రదర్శనతో ఫ్రాంచైజీలను తీవ్రంగా నిరాశపరిచారు.**




**1. డానిష్ మలేవార్ (ముంబై ఇండియన్స్):**

విదర్భకు చెందిన 22 ఏళ్ల ఓపెనర్ డానిష్ మలేవార్ మీద ముంబై ఇండియన్స్ భారీ అంచనాలు పెట్టుకుంది. రోహిత్ శర్మ గాయపడటంతో బ్యాకప్ ఓపెనర్‌గా ఉన్న ఇతనికి అనూహ్యంగా అవకాశం దక్కింది. కానీ, గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన డెబ్యూ మ్యాచ్‌లో కేవలం 2 పరుగులు మాత్రమే చేసి నిరాశపరిచాడు. ఆ తర్వాత చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన హై-వోల్టేజ్ మ్యాచ్‌లో గోల్డెన్ డక్ (సున్నా) అవుట్ అయ్యాడు. దీంతో ముంబై మేనేజ్‌మెంట్ ఇతనిపై నమ్మకం కోల్పోయింది. రాబోయే వేలంలో ఇతనికి అవకాశం దక్కడం దాదాపు అసాధ్యమే.

**2. సాహిల్ పరాఖ్ (ఢిల్లీ క్యాపిటల్స్):**

18 ఏళ్ల ఈ యువ బ్యాటర్ మహారాష్ట్ర తరపున దేశవాళీ క్రికెట్‌లో అదరగొట్టాడు. దీంతో ఢిల్లీ క్యాపిటల్స్ నిశాంకను తప్పించి మరీ ఇతనికి ఓపెనింగ్ ఛాన్స్ ఇచ్చింది. అయితే, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ వేసిన వేగానికి సాహిల్ దగ్గర సమాధానం లేకపోయింది. కేవలం రెండు బంతులు ఎదుర్కొని డకౌట్ అయ్యాడు. ఐపీఎల్ లాంటి పెద్ద టోర్నీల్లో పదే పదే అవకాశాలు రావు. సాహిల్ కెరీర్‌కు ఇది పెద్ద ఎదురుదెబ్బగా మారింది.

**3. కృష్ భగత్ (ముంబై ఇండియన్స్):**

పంజాబ్ నుంచి వచ్చిన 21 ఏళ్ల ఫాస్ట్ బౌలర్ కృష్ భగత్ పట్ల హార్దిక్ పాండ్యా జట్టు పెద్ద రిస్క్ తీసుకుంది. దీపక్ చాహర్ వైఫల్యంతో కృష్‌కు ప్లేయింగ్ ఎలెవన్‌లో చోటు దక్కింది. కానీ, తను ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ దారుణంగా పరుగులు సమర్పించుకున్నాడు. 10.5 ఎకానమీ రేటుతో బౌలింగ్ చేస్తూ ఒక్క వికెట్ కూడా పడగొట్టలేకపోయాడు. ఒక ఫాస్ట్ బౌలర్‌గా కీలక సమయాల్లో వికెట్లు తీయలేకపోవడం ఇతని భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసింది.

**4. జార్జ్ లిండే (లక్నో సూపర్ జాయింట్స్):**

దక్షిణాఫ్రికా ఆల్ రౌండర్ జార్జ్ లిండే కథ కొంచెం భిన్నమైంది. వేలంలో అన్‌సోల్డ్ గా మిగిలిపోయిన ఇతనికి హసరంగ స్థానంలో లక్నో జట్టులో అవకాశం దక్కింది. మూడు మ్యాచ్‌ల్లో అవకాశం ఇచ్చినా.. బ్యాట్‌తో కేవలం 31 పరుగులు, బౌలింగ్‌లో కేవలం ఒక వికెట్ మాత్రమే తీశాడు. 34 ఏళ్ల వయస్సులో ఉన్న లిండేకు, విదేశీ ఆటగాళ్ల కోటాలో ఇలాంటి ప్రదర్శన చేస్తే తదుపరి సీజన్లలో చోటు దక్కడం కష్టమే.

వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకున్న వారే ఐపీఎల్ చరిత్రలో నిలుస్తారు. ఈ నలుగురు ఆటగాళ్లకు 2026 సీజన్ మొదటిది మరియు చివరిది అయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. వీరి స్థానంలో కొత్త టాలెంట్ కోసం ఫ్రాంచైజీలు వేట మొదలుపెట్టే అవకాశం ఉంది.

# కింగ్స్‌కు షాక్!

**పోరాడి ఓడిన పంజాబ్ జట్టు**
**టైటాన్స్ ఖాతాలో ఉత్కంఠ విజయం**
**అదరగొట్టిన సుదర్శన్, సుందర్**
**హోల్డర్ ఖాతాలో నాలుగు వికెట్లు**




**అహ్మదాబాద్ :** నరేంద్ర మోదీ స్టేడియంలో ఆదివారం జరిగిన ఐపీఎల్ ఉత్కంఠ పోరులో పంజాబ్ కింగ్స్ జట్టుపై గుజరాత్ టైటాన్స్ నాలుగు వికెట్ల తేడాతో అద్భుత విజయం సాధించింది. ఆఖరి బంతి వరకు నరాలు తెగే ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్ లో గుజరాత్ ఆటగాళ్లు సమిష్టిగా సత్తా చాటారు. మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 163 పరుగులు చేసింది. అనంతరం గుజరాత్ 19.5 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 167 పరుగులు చేసి విజయ కేతనం ఎగురవేసింది.


### రాణించిన సూర్యాన్ష్..

టాస్ గెలిచిన గుజరాత్ టైటాన్స్ మొదట బౌలింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్ కు దిగిన పంజాబ్ కింగ్స్ కు ఓ మోస్తరు ఆరంభం లభించింది. యువ సంచలనం సూర్యాన్ష్ షెడ్జ్ కేవలం 29 బంతుల్లోనే 57 పరుగులు చేసి జట్టుకు భారీ స్కోరు అందించే ప్రయత్నం చేశాడు. అతనికి జతగా మార్కస్ స్టోయినిస్ (31 బంతుల్లో 40), చివర్లో మార్కో జాన్సెన్ (11 బంతుల్లో 20) రాణించారు. మిగతా బ్యాటర్లు విఫలం కావడంతో పంజాబ్ 163 పరుగులకే పరిమితమైంది. గుజరాత్ బౌలర్లలో జాసన్ హోల్డర్ 4 ఓవర్లలో 24 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టి పంజాబ్ నడ్డి విరిచాడు. కగిసో రబడ 2, మహ్మద్ సిరాజ్ 2 వికెట్లు తీశారు.

### ఆదుకున్న సుదర్శన్, సుందర్

164 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ టైటాన్స్ కు ఓపెనర్ జోస్ బట్లర్ (22 బంతుల్లో 26) శుభారంభం అందించాడు. ఆ తర్వాత వచ్చిన సాయి సుదర్శన్ (41 బంతుల్లో 57) బాధ్యతాయుత ఇన్నింగ్స్ తో జట్టును నిలబెట్టాడు. క్రీజులో పాతుకుపోయి పంజాబ్ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నాడు. చివర్లో వాషింగ్టన్ సుందర్ (23 బంతుల్లో 40 నాటౌట్) అద్భుతమైన పోరాట పటిమ కనబరిచాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా ఏమాత్రం ఒత్తిడికి గురికాకుండా ఆఖరి ఓవర్ వరకు క్రీజులో నిలబడి ఒక బంతి మిగిలి ఉండగానే జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. పంజాబ్ బౌలర్లలో అర్షదీప్ సింగ్ 2, విజయ్ కుమార్ వైశాక్ 2, మార్కస్ స్టోయినిస్ ఒక వికెట్ తీసినా జట్టును గెలిపించలేకపోయారు.








### పూజా కార్యక్రమాలతో మొదలైన

# గోపీచంద్ కొత్త సినిమా..

### వి.వెంకట్ దర్శకత్వంలో భారీ ప్రాజెక్ట్!



యాక్షన్ హీరో గోపీచంద్ తన 34వ చిత్రాన్ని ఆదివారం నాడు పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభించారు. 'యాత్ర', 'ఆనందో బ్రహ్మ' వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించిన 70ఎఎ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తుండగా. యాక్షన్ కొరియోగ్రాఫర్‌గా ఇండస్ట్రీలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న వి.వెంకట్, ఒక గ్రిప్పింగ్ మరియు రూటెడ్ కథతో ఈ సినిమాను వెండితెరపై ఆవిష్కరించబోతున్నారు. ఇటీవల విడుదలైన అనౌన్స్మెంట్ పోస్టర్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచింది. మండుతున్న ఆకాశం, ఒక కొండపై గంభీరంగా నిలబడిన బ్లాక్ పాంథర్ విజువల్స్ చూస్తుంటే, ఇది ఒక ఇంటెన్స్ మైథికల్ యాక్షన్ డ్రామా అని స్పష్టమవుతోంది. ఈ చిత్రానికి టాలీవుడ్ టాప్ టెక్నీషియన్స్ పనిచేస్తున్నారు. సామ్ సి.ఎస్ (**ఎ **) సంగీతాన్ని అందిస్తుండగా, శామ్‌దత్ ఐఎస్‌సి ఛాయాగ్రహణం బాధ్యతలు చేపట్టారు. జాతీయ అవార్డు గ్రహీత శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్‌గా, రామక*ష్ణ-మౌనిక ప్రొడక్షన్ డిజైనర్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం గోపీచంద్ 'భరత వర్ష' అనే పీరియడ్ చిత్రంలో నటిస్తుండగా, ఆ సినిమా పూర్తయిన వెంటనే ఈ కొత్త ప్రాజెక్ట్ షూటింగ్ ప్రారంభం కానుంది

## బ్రేకప్ తర్వాత మళ్లీ ప్రేమలో పడ్డ అక్షరా సింగ్



భోజ్‌పురి సినీ పరిశ్రమలో ఒకప్పుడు హాట్ టాపిక్‌గా నిలిచిన పవన్ సింగ్-అక్షరా సింగ్ ప్రేమకథ మరోసారి వార్తల్లో నిలిచింది. గతంలో ఈ ఇద్దరి రిలేషన్‌షిప్ పెద్ద చర్చకు దారితీసిన సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడు బ్రేకప్ తర్వాత అక్షరా సింగ్ మళ్లీ ప్రేమలో పడినట్లు వెల్లడించడం ఆసక్తికరంగా మారింది. ఇటీవల ఓ ***ట్యూబ్ ఇంటర్వ్యూలో మాట్లాడిన అక్షరా సింగ్ తన లవ్ లైఫ్ గురించి ఓపెన్ అయ్యారు. ''అవును, నేను ప్రస్తుతం ప్రేమలో ఉన్నాను'' అని స్పష్టంగా చెప్పారు. అయితే ఆ ప్రేమ గురించి పూర్తి వివరాలు వెల్లడించడానికి ఇంకా సమయం ఉందని పేర్కొన్నారు. ''ప్రేమ అనే పదంలోని మొదటి అక్షరం వద్దనే ఉన్నాను. పూర్తిగా అర్థం చేసుకున్న తర్వాత మరిన్ని విషయాలు చెబుతాను'' అంటూ ఆసక్తికరంగా స్పందించారు. గతంలో పవన్ సింగ్‌తో అక్షరా సింగ్ ప్రేమలో ఉన్నారని, ఇద్దరూ పెళ్లి చేసుకుంటారని కూడా ప్రచారం జరిగింది. కానీ 2018లో పవన్ సింగ్ జ్యోతి సింగ్‌ను వివాహం చేసుకోవడంతో వారి బంధం ముగిసింది. అనంతరం అక్షరా సింగ్ ఆయనపై పలు ఆరోపణలు చేయడం కూడా పెద్ద చర్చకు దారితీసింది. ఇప్పుడు మళ్లీ ప్రేమలో ఉన్నానని చెప్పినప్పటికీ, తన ప్రియుడి పేరును మాత్రం అక్షరా సింగ్ వెల్లడించలేదు. ''పేరు చెప్పితే దిష్టి తగులుతుందేమో అని పిస్తోంది'' అంటూ చిరునవ్వుతో సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం తన ప్రేమను అర్థం చేసుకునే దశలో ఉన్నానని, భవిష్యత్తులో భాగస్వామి మనస్తత్వం తనకు సరిపోతుందా లేదా అన్నది తెలుసుకున్న తర్వాతే పెళ్లి గురించి ఆలోచిస్తానని ఆమె స్పష్టం చేశారు. మొత్తానికి, గత ప్రేమ విఫలమైనా ముందుకు సాగుతూ కొత్త జీవితాన్ని ఆహ్వానిస్తున్న అక్షరా సింగ్ నిర్ణయం అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. మరి ఈ అమ్మడు తన లవ్‌కి సంబంధించిన పూర్తి విషయాలు ఎప్పుడు బయట పెడుతుందా అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు

## ఓటీటీకి డెకాయిట్ మూవీ

అడివి శేష్ హీరోగా షానిల్ డియో తెరకెక్కించిన యాక్షన్ వ*వీ 'డెకాయిట్'. సుప్రియ యార్లగడ్డ నిర్మించిన ఈ సినిమాలో మ*ణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటించింది. ఇక ఈ వ*వీని ఏప్రిల్ 10న రిలీజ్ చేశారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద కలెక్షన్స్ పరంగా ?అదరగొట్టింది. తొలిరోజే రూ. 15 కోట్లతో రికార్డ్ క్రియేట్ చేసింది. అంతేకాకుండా కేవలం వ*డు రోజుల్లోనే రూ.34.77 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. తాజాగా ఈ వ*వీ ఓటీటీ రిలీజ్ డేట్ వచ్చేసింది. ఈ చిత్రాన్ని మే 8వ తేదీ నుంచి స్ట్రీమింగ్ చేయనున్నారు. ?అమెజాన్ ప్రైమ్ వేదికగా ఈ సినిమా అందుబాటులోకి రానుంది. ఈ విషయాన్ని అఫీషియల్‌గా ప్రకటించారు. ఈ వ*వీ తెలుగుతో పాటు కన్నడ, మలయాళం, తమిళ భాషల్లో స్ట్రీమింగ్ కానుంది. కాగా.. ఈ చిత్రంలో అనురాగ్ కశ్యప్, ప్రకాశ్ రాజ్, కామాక్షి భాస్కర్ల కీలక పాత్రల్లో నటించారు.

# గ్లామర్ పాత్రలకు బ్రేక్ ..

### శ్రీలీల కెరీర్‌లో కొత్త మలుపు



టాలీవుడ్‌లో తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న శ్రీలీల ఇప్పుడు తన కెరీర్‌లో కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. 'పెళ్లిసందడి' సినిమాతో అలరించిన ఆమె, అద్భుతమైన డాన్స్, ఆకట్టుకునే నటనతో యువతలో మంచి ఫాలోయింగ్ సంపాదించుకుంది. వరుసగా స్టార్ హీరోల సరసన నటిస్తూ కెరీర్ గ్రాఫ్‌ను వేగంగా పెంచుకున్నప్పటికీ, ఇటీవల ఆమె నటించిన కొన్ని భారీ సినిమాలు ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయాయి. ఈ నేపథ్యంలో శ్రీలీల తన రూట్‌ను మార్చుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

ఇప్పటి వరకు గ్లామర్, కమర్షియల్ పాత్రలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చిన ఆమె, ఇకపై బలమైన కథాంశం ఉన్న సినిమాలపై ద*ష్టి పెట్టాలని భావిస్తోంది. ముఖ్యంగా కుటుంబ కథా చిత్రాలు, భావోద్వేగాలకు ప్రాధాన్యం ఉన్న పాత్రల్లో నటించాలని తన కోరికను వెల్లడించింది. ఇక ప్రస్తుతం ఈ యంగ్ హీరోయిన్ కోలీవుడ్‌పైనా ఫోకస్ పెంచింది. ఇప్పటికే 'పరాశక్తి' అనే తమిళ చిత్రంతో అక్కడి ప్రేక్షకులకు పరిచయమైన ఆమె, ఇప్పుడు ధనుష్ సరసన ఆయన 55వ చిత్రంలో నటిస్తోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్పై భారీ అంచనాలు నెలకొన్నాయి. అలాగే బాలీవుడ్‌లో కూడా ఓ సినిమాతో బిజీగా ఉంది. అయితే తన కెరీర్ ప్రయాణంపై స్పందించిన శ్రీలీల, ''వైవిధ్యభరితమైన పాత్రలే నటిగా నాలోని పూర్తి ప్రతిభను బయటకు తీస్తాయి. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కావడం ఇష్టం లేదు. ప్రేక్షకులకు గుర్తుండిపోయే పాత్రలు చేయాలనుకుంటున్నాను'' అని పేర్కొంది. అందుకే ఇకపై కథల ఎంపికలో మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తానని తెలిపింది.

శ్రీలీల చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఆమె తీసుకున్న ఈ కొత్త దిశలోని నిర్ణయం కెరీర్‌కు ఎంతవరకు సహాయపడుతుందో చూడాలి. అయితే నటిగా మరింత వైవిధ్యం చూపించాలని ఉన్న ఆమె తపనను అభిమానులు స్వాగతిస్తున్నారు.కాగా, శ్రీలీల చివరిగా పవన్ కళ్యాణ్ నటించిన ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రంలో నటించింది. ఈ సినిమా ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది






### ఘనంగా బండ్ల గణేష్ కుమార్తె జనని నిశ్చితార్థం..

#### హాజరైన సినీ, రాజకీయ ప్రముఖులు

**హైదరాబాద్ :** నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ ఇంట త్వరలోనే పెళ్లి బాజాలు మోగనున్నాయి. ఆయన కుమార్తె జనని వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన సూర్య తేజతో జనని వివాహం జరగనుంది. వీరి నిశ్చితార్థ వేడుకను ఆదివారం ఉదయం నిర్వహించారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఏపీ సీఎం చంద్రబాబు దంపతులు, ప్రముఖ నటుడు చిరంజీవితో సహా పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరై, కాబోయే దంపతులను ఆశీర్వదించారు. రాఘవేంద్ర రావు, బ్రహ్మానందం, కోన వెంకట్, శివాజీ, సి.కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

### డ్రాగన్ కోసం డబుల్ మేకోవర్..

## ఎన్టీఆర్ ఫ్యాన్స్ కు పూనకాలే



మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ - సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వస్తున్న డ్రాగన్ చిత్రంపై అంచనాలు ఓ రేంజ్ లో ఉన్నాయి. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జెట్ స్పీడ్ లో ఫుల్ స్వింగ్‌లో జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం ప్రశాంత్ నీల్ స్క్రిప్ట్‌లో మరిన్ని కీలక మార్పులు చేసి గతంలో కంటే మరింత పవర్‌ఫుల్‌గా ఎలివేషన్లను ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో తారక్ మునుపెన్నడూ చూడని విధంగా రెండు విభిన్న రూపాల్లో కనిపించబోతున్నారు. ఒకే సినిమాలో రెండు షేడ్స్ చూపించడం ప్రశాంత్ నీల్ స్పెషాలిటీ కాగా, ఎన్టీఆర్ మేకోవర్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. పార్ట్-1లో ఎన్టీఆర్ చాలా షార్ప్‌గా, లీన్ లుక్‌లో కనిపించనున్నారు. పార్ట్-2 కోసం తారక్ 'బీస్ట్ మోడ్'లోకి మారనున్నారు. భారీ కండలు పెంచి బల్క్ ట్రాన్స్‌ఫార్మేషన్ చూపించబోతున్నారు. ఎన్టీఆర్ మేకోవర్ ఫొటోలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు ఫ్యాన్స్.

### పర్పుల్ శారీలో సీరత్

# అందాల జాతర



గ్లామర్‌తో అభిమానులను అలరిస్తూ సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే సీరత్ కపూర్ మరోసారి తన లేటెస్ట్ ఫోటోలతో అందరి దృష్టిని ఆకర్షించింది. 'రన్ రాజా రన్' సినిమాతో టాలీవుడ్‌లో గుర్తింపు తెచ్చుకున్న ఈ భామ, ఇప్పుడు సోషల్ మీడియానే తన స్టైల్ స్టేజ్‌గా మార్చుకుంది. తాజాగా పర్పుల్ కలర్ శారీలో దర్శనమిచ్చిన సీరత్, సంప్రదాయానికి గ్లామర్ టచ్ జోడిస్తూ ఆకట్టుకుంది. స్టైలిష్ బ్లౌజ్, మెడలో భారీ హారం, వదిలిన జుట్టుతో ఆమె లుక్ మరింత ప్రత్యేకంగా నిలిచింది. అందాలను హైలైట్ చేస్తూ ఇచ్చిన స్టన్నింగ్ పోజులు అభిమానులను ఫిదా చేస్తున్నాయి. క్లాసిక్ లుక్‌లోనూ తన గ్లామర్ ఏ మాత్రం తగ్గలేదని నిరూపించిన సీరత్ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారి నెటిజన్ల నుంచి భారీ స్పందన అందుకుంటున్నాయి.

Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com